ప్రజాశక్తి

సోమవారం 6 అక్టోబర్ 2025   8 పేజీలు

ప్రకాశం   బాపట్ల






ఒంగోలు భూవివాదాల్లో

తాడిపత్రి ముఠా

- ప్రభుత్వ ఉదాసీనతే కారణమా..?
- జేసీ బెదిరించారని టిడిపి నేత పెద్దిరెడ్డి ఆరోపణ
- న్యాయం కోసం జేసిని కలిశానని మరో బాధితుడు సుదర్శనం వెల్లడి



జెసి ప్రభాకర్‌రెడ్డి



పెద్దిరెడ్డి సూర్య ప్రకాశ్ రెడ్డి

ప్రజాశక్తి-ఒంగోలుబ్యూరో

ఒంగోలులో భూ వివాదాలు ఆందోళన కలిగిస్తున్నాయి. ఎప్పుడు ఎవరికి ఏం జరుగుతుందోన్న ఉత్కంఠ కూడా కొందరు బాధితుల్లో కనిపిస్తోంది. భూ వివాదాలపై రాష్ట్ర ప్రభుత్వ ఉదాసీన వైఖరే ఇలాంటి పరిస్థితులకు కారణాలుగా విశ్లేషిస్తున్నారు. తాజాగా సుజాత నగర్‌లోని 148వ సర్వేనెంబరులోని ఎకరం భూమికి సంబంధించిన భూమి వివాదంతో అనంతపురం జిల్లా తాడిపత్రికి చెందిన ఫ్యాక్షనిస్టులు తలదూర్చారు. ఇరువురి మధ్య ఉన్న వివాదాన్ని తమకు అనుకూలంగా మల్చుకునే యత్నం చేశారు. పంచాయతీ పెట్టేందుకు ప్రయత్నాలు చేశారు. అందరూ పాలకపక్ష నేతలు కావడం గమనార్హం. తాడిపత్రి మున్సిపల్ ఛైర్మన్ జేసీ ప్రభాకర్‌రెడ్డిపై ఒంగోలుకు చెందిన టిడిపి నేత పెద్దరెడ్డి సూర్యప్రకాష్‌రెడ్డి ఆరోపణలు చేశారు. పెద్దిరెడ్డి ఆరోపణలు సంచలనంగా మారాయి. ఇక్కడ ఓ భూమికి సంబంధించిన విషయంలోనే ఇదంతా జరిగిందని చెప్పారు. తాను కొన్న భూమి విషయంలో రాజీ చేసుకోవాలని, లేకుంటే మా మనుషులు వచ్చి ఎత్తుకుపోతారని జేసీ బెదిరించారని పెద్దిరెడ్డి వీడియో సందేశం విడుదల చేయడం కలకలం రేపింది. ఈ వ్యవహారం పెద్ద దుమారానికి దారితీసింది. ఆ వీడియోలో పెద్దిరెడ్డి తాడిపత్రికి చెందిన జేసీ, ఆయన అనుచరులు తనను ఎలా బెదిరించారో వివరించారు. ఇక్కడ ఎవరూ భయపడరంటూ గట్టిగానే ఆయనకు సవాలు విసిరారు. ఇదిలా ఉండగా ఆదివారం నాడు అదే సర్వే నెంబరు భూమిలో తమకు ▶ 2లో

గ్రానైట్ ఫ్యాక్టరీల బంద్‌తో..

రోడ్డున పడిన కార్మికులు

- ఐదు రోజులుగా మూతపడిన ఫ్యాక్టరీలు
- పనుల్లేక స్వగ్రామాలకు తరలుతున్న కార్మికులు
- ఆందోళనలో ఫ్యాక్టరీ యజమానులు
- ప్రభుత్వ స్పందన కోసం ఎదురుచూపులు

ప్రజాశక్తి-చీమకుర్తి

గత ఐదు రోజులుగా గ్రానైట్ ఫ్యాక్టరీలు బంద్ కొనసాగుతూనే ఉంది. సీనరేజీ వసూలు ప్రభుత్వం కట్టబెట్టిన ఏఎంఆర్ ప్రైవేట్ సంస్థకు ఫ్యాక్టరీ యజమానులకు, క్వారీ యజమానులకు మధ్య జరిగిన చర్చలు విఫలమయ్యాయి. ప్రభుత్వం నిర్దేశించిన సీనరేజీతో పాటు అదనపు వసూలును గ్రానైట్ ఫ్యాక్టరీ యజమానులు తిరస్కరిస్తున్నారు. ఇప్పటికే ప్రభుత్వం రూ.27 వేలు నుంచి ఎనిమిది వేల రూపాయలు అదనంగా ఒక్కో బ్లేడుకు సీనరేజీ పెంచిందని, దానిని కట్టడమే భారంగా మారిందని పేర్కొన్నారు. ఇరు వర్గాల మధ్య చర్చలు విఫలం కావడంతో బంద్ కొనసాగించడానికి యజమానులు సిద్ధపడుతున్నారు. ఈ నేపథ్యంలో కార్మికులు పనులు లేక, బిల్లులేక, ఉండటం భారంగా మారడంతో వారు తమ స్వగ్రామాలకు, సొంత రాష్ట్రాలకు తరలి వెళ్తున్నారు. దీనికి తోడు ఈనెల 20వ తేదీన దీపావళి పండుగ ఉండడంతో కార్మికులు వెళ్లడానికి ముందుకు వస్తున్నారు. ఇక్కడ ఉండాలన్న ఖర్చులు పెరుగుతున్నాయి, వేతనాలు లేని పరిస్థితి వారిని నిద్ర పట్టనీకున్నాయి. యజమానులను తమకు రావాల్సిన బిల్లులు చెల్లించాలని కోరుతున్నారు. అటు యజమానులకు ఫ్యాక్టరీలు నిలిచి పోవడంతో ఎగుమతులు ఆగిపోయాయి. స్వగ్రామాలకు వెళ్లిపోయిన కార్మికులు తిరిగి ఫ్యాక్టరీలకు రావాలంటే మరో నెల పైగా ▶ 2లో



మూతపడిన గ్రానైట్ ఫ్యాక్టరీ

ఫ్యాక్టరీ యజమానులతో

ప్రభుత్వం చర్చలు జరపాలి

గ్రానైట్ పాలిషింగ్ ఫ్యాక్టరీ యజమానులతో ప్రభుత్వం వెంటనే చర్చించి సమ్మె విరమింపచేయాలని సిఐటియు జిల్లా అధ్యక్షుడు కాలం సుబ్బారావు డిమాండ్ చేశారు. సిఐటియు జిల్లా కార్యదర్శి కాలం సుబ్బారావు, జిల్లా నాయకులు పల్లాపల్లి ఆంజనేయులు, సిఐటియు నాయకులు బృందం మర్రిచెట్లపాలెం, బూదవాడ పరిసర ప్రాంతాలలోని గ్రానైట్ ఫ్యాక్టరీల కార్మికులను కలిసి సమస్యలను అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా కాలం సుబ్బారావు మాట్లాడుతూ కరోనా కాలం నుంచి గ్రానైట్ పరిశ్రమ సంక్షోభంలో కూరుకుపోయిందన్నారు. ఇప్పటికే అనేక ఫ్యాక్టరీలు మూతపడి యజమానులు, కార్మికులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని పేర్కొన్నారు.



కార్మికులతో మాట్లాడుతున్న కాలం సుబ్బారావు

' స్వర్ణాంధ్ర - స్వచ్ఛ ఆంధ్ర 'లో..

'ప్రకాశం'కు 3 రాష్ట్రస్థాయి అవార్డులు


జిల్లాస్థాయిలో 49 అవార్డులు

నేడు ఒంగోలులో అవార్డుల ప్రదానం

ప్రజాశక్తి -ఒంగోలు కలెక్టరేట్

రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన స్వర్ణాంధ్ర – స్వచ్ఛ ఆంధ్ర కార్యక్రమం ప్రకాశం జిల్లాలో భేష్ అన్న స్థాయిలో సాగింది. రాష్ట్ర స్థాయిలో ప్రకాశం జిల్లా మూడు అవార్డులను అందుకోనుంది. విజయవాడలో సోమవారం జరిగే రాష్ట్ర స్థాయి స్వర్ణాంధ్ర –స్వచ్ఛ ఆంధ్ర కార్యక్రమంలో ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు నుంచి అవార్డులను జిల్లా పంచాయతీ అధికారి ఎం.వెంకటేశ్వరరావు, చీమకుర్తి పంచాయతీ, చీమకుర్తి సిహెచ్‌సి, స్వచ్ఛ ఎస్‌ఎల్‌ఎఫ్‌గా కనిగిరి మండలం వీరబ్రహ్మేంద్ర మహిళా సంఘం అవార్డులు అందుకోనున్నారు. స్వచ్ఛ ఆంధ్ర అవార్డులు 2025 కోసం రాష్ట్ర స్థాయి పరిశుభ్రత సర్వే 2025 ఆగస్టు 20 నుంచి సెప్టెంబర్ 27 వరకు నిర్వహించారు. వీటి ఆధారంగా విజేతలను ఖరారు చేశారు.

జిల్లా స్థాయిలో 49 అవార్డులను ఇవ్వనున్నారు. అవార్డులలో ఉత్తమ స్వచ్ఛత గ్రీన్ అంబాసిడర్లు 4, ఉత్తమ స్వచ్ఛత ఎన్జీవోలుగా 2, ఉత్తమ స్వచ్ఛత వారియర్స్‌గా 5, స్వచ్ఛ అంగన్‌వాడీలుగా 5, స్వచ్ఛత బస్ స్టేషన్‌గా



ఒంగోలు బస్ స్టేషన్, స్వచ్ఛత ప్రభుత్వ కార్యాలయాలు 3, స్వచ్ఛత గ్రామ పంచాయతీలుగా 5, స్వచ్ఛత హాస్పిటల్స్‌గా 6, స్వచ్ఛత ఇండస్ట్రీస్ (లార్జ్, మెగా) చెరువుకొమ్ముపాలెం భగీరథ కెమికల్స్, ఇండస్ట్రీస్ లిమిటెడ్, స్వచ్ఛత ఇండస్ట్రీస్ (ఎంఎస్‌ఎంఈ) 1, స్వచ్ఛత మున్సిపాలిటీగా కనిగిరి మున్సిపాలిటీ, స్వచ్ఛత రెసిడెన్షియల్ స్కూలుగా సింగరాయకొండ ప్రభుత్వ బిసి బాలికల హాస్టల్, స్వచ్ఛత స్కూల్‌గా 5, స్వచ్ఛత ఎస్‌ఎల్‌ఎఫ్‌గా 2, స్వచ్ఛత విలేజ్ ఆర్గనైజేషన్‌గా ఐదు అవార్డులు గెల్చుకున్నాయి.

నేడు ఒంగోలులో అవార్డుల ప్రదానం

స్వర్ణాంధ్ర, స్వచ్ఛ ఆంధ్ర కార్యక్రమంలో జిల్లా స్థాయిలో అవార్డులను సోమవారం ప్రదానం చేయనున్నారు. ఒంగోలులోని జిజిహెచ్ ఆడిటోరియంలో సోమవారం సాయంత్రం జరిగే జిల్లాస్థాయి అవార్డులను కలెక్టర్ పి.రాజాబాబు, జిల్లా అధికారులు అందజేయనున్నారు.

బాపట్ల జిల్లాకు ఒక రాష్ట్రస్థాయి అవార్డు

ప్రజాశక్తి-బాపట్ల జిల్లా

స్వచ్ఛాంధ్ర–స్వర్ణాంధ్ర కార్యక్రమంలో భాగంగా వివిధ విభాగాలలో రాష్ట్ర, జిల్లా స్థాయిలో కృషి చేసిన సంస్థలు, వ్యక్తులకు జిల్లా ఇన్‌ఛార్జి మంత్రి కొలుసు పార్థసారధి చేతుల మీదుగా స్వచ్ఛతా అవార్డుల ప్రధాన కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్లు జిల్లా కలెక్టర్ డాక్టర్ వి.వినోద్ కుమార్ ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. సోమవారం సాయంత్రం 4 గంటలకు బాపట్ల పట్టణంలోని కమ్మ కల్యాణ మండపంలో ఈ కార్యక్రమం జరుగుందని కలెక్టర్ తెలిపారు. రాష్ట్ర స్థాయిలో బాపట్ల జిల్లాకు ఒక్క అవార్డు రావడం జరిగిందని, జిల్లా స్థాయిలో వివిధ విభాగాలలో 49 అవార్డులు రావడం జరిగిందని తెలిపారు. జిల్లా స్థాయి కార్యక్రమం నేడు సాయంత్రం 4 గంటలకు బాపట్ల పట్టణంలోని కమ్మ కల్యాణ మండపంలో జిల్లా ఇన్‌ఛార్జి మంత్రి, సమాచార శాఖ మంత్రి కొలుసు పార్థసారధి చేతుల మీదుగా ఈ అవార్డులు పంపిణీ చేయనున్నట్లు తెలిపారు. అవార్డులు పొందిన అన్ని శాఖల అధికారులు హాజరై అవార్డులు స్వీకరించాలని కలెక్టర్ సూచించారు.

స్కాలర్‌షిప్ అందక ఇక్కట్లు

- జిల్లాలో రూ.122.94 కోట్లు బకాయి
- పేద విద్యార్థుల పట్ల ప్రభుత్వం చిన్నచూపు
- విద్యా సంవత్సరం ముగిసి ఐదు నెలలైనా విడుదల కాని వైనం
- ఇబ్బందులు పడుతున్న విద్యార్థులు

ప్రజాశక్తి-ఒంగోలు సిటీ

కూటమి ప్రభుత్వం విద్యార్థుల సంక్షేమాన్ని తీవ్ర నిర్లక్ష్యం చేస్తోంది. గుడ్ గవర్నెన్స్‌కు ప్రాధాన్యత ఇస్తామని ఎన్నికల్లో హామీలు ఇచ్చిన ప్రభుత్వం వ్యవస్థలో అత్యంత ప్రధానమయిన విద్యారంగాన్ని, అందునా పేద విద్యార్థుల చదువుల విషయంలో ప్రభుత్వం చిన్న చూపు చూస్తోంది. 2024–2025 విద్యా సంవత్సరం పెండింగ్ స్కాలర్‌షిప్ మంజూరు చేయకపోవడమే నిదర్శనం. ఈ విద్యా సంవత్సరం ప్రారంభమై నాలుగు నెలలు అవుతున్నా గత ఏడాది పోస్టుమెట్రిక్ (ఐటిఐ, ఇంటర్, డిగ్రీ, ఇతర వృత్తి కోర్సులు) విద్యార్థులకు స్కాలర్‌షిప్ ఇంతవరకూ విడుదల కాలేదు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తరువాత గత ఏడాది (2024–2025) సంబంధించి మొదటి క్వార్టర్‌కు రూ.40.98 కోట్లు ఫిబ్రవరిలో విడుదల చేసింది. కాగా గత ఏడాది జులై నుంచి ఈ ఏడాది మార్చి వరకు 9 నెలలు బకాయిలు నిలిచిపోయాయి. జిల్లాలోని 8 నియోజకవర్గాల పరిధిలో 43,050 మంది విద్యార్థులకు తొమ్మిది నెలలుగా ఒక్క రూపాయి కూడా స్కాలర్‌షిప్ విడుదల కాలేదు. ఈ తొమ్మిది నెలలకు సంబంధించి జిల్లాకు రూ.122.94 కోట్లు బకాయిలు ఉన్నాయి. స్కాలర్‌షిప్ విడుదల కాక కోర్సు పూర్తి చేసిన విద్యార్థులు, కాలేజీ ఫీజు చెల్లించ నందున, మేనేజ్మెంట్ సర్టిఫికెట్స్ ఇవ్వనందున ఇక్కట్లు పడుతున్నారు.

స్కాలర్‌షిప్ పెండింగ్‌లు ఇలా..

జిల్లాలో 14,543 మంది బిసి విద్యార్థులకు రూ 31.84 కోట్లు పెండింగ్ ఉండగా, 10,772 మంది ఇబిసి విద్యార్థులకు రూ.31.64 కోట్లు మొత్తం రూ.63.48 కోట్లు విడుదల కావలసి ఉంది. 11,340 మంది ఎస్సీ విద్యార్థులకు రూ.38.50 కోట్లు బకాయిలు ఉండగా, 1,097 మంది ఎస్టీ విద్యార్థులకు రూ.8.66 కోట్లు, మొత్తం రూ.47.16 కోట్లు బకాయిలు ఉన్నాయి. అలాగే 2,513 మంది కాపు విద్యార్థులకు రూ.6.34 కోట్లు స్కాలర్‌షిప్ విడుదల కావలసి ఉంది. 2,750 మంది ముస్లిం మైనారిటీ విద్యార్థులకు రూ.5.84 కోట్లు, 35 మంది క్రిస్టియన్ మైనారిటీలకు రూ.10.48 లక్షలు, మొత్తం మైనారిటీలకు రూ.5.95 కోట్లు స్కాలర్ షిప్పులు విడుదల కావలసి ఉంది. పెండింగ్ స్కాలర్ షిప్పులు విడుదల కోసం రాష్ట్ర వ్యాప్తంగా ఎస్ఎఫ్ఐ, ఏఐఎస్ఎఫ్, పిడిఎస్‌యు వంటి విద్యార్థి సంఘాలు ఈ కాలంలో దశల వారీగా ఆందోళన చేపట్టినప్పటికీ ప్రభుత్వం స్పందించని పరిస్థితి.

బడ్జెట్ కేటాయింపులు ఏమై నట్లు..?

2024–2025 విద్యా సంవత్సరం బడ్జెట్‌లో అప్పటి ప్రభుత్వం స్కాలర్‌షిప్పుల కోసం రూ.4,267 కోట్లు (వసతి దీవెన) కేటాయించగా 2025–2026 ఆర్థిక సంవత్సరంలో ▶ 2లో

ఒంగోలు భూవివాదాల్లో తాడిపత్రి ముఠా

(మొదటి పేజీ తరువాయి)

హక్కు ఉందని, కోర్టు వేలం ద్వారా చివుకుల గోపాలకృష్ణ భూమిని కొన్నారని ఆయన మనవడు సుదర్శనం మీడియాకు వివరించారు. తాను న్యాయం కోసం జేసీ ప్రభాకర్‌రెడ్డిని కలిశామన్నారు. పెద్దిరెడ్డి సూర్యప్రకాష్‌రెడ్డి చేసిన ఆరోపణల్లో నిజం లేదన్నారు. వాస్తవానికి భూ వివాదం ఇరువురి మధ్య ఉంది. గత పభుత్వ హాయంలోనే ఇది వివాదానికి దారి తీసింది. ఈ భూమిని కపడ జిల్లాకు చెందిన వ్యక్తుల వద్ద కొనుగోలు చేసినట్లు పెద్దిరెడ్డి చెబుతున్నారు. తనకు అన్ని రకాలుగా హక్కులున్నాయన్నారు. ఈ భూమి నా స్వాధీనంలోనే ఉందని చెబుతున్నారు. అయితే ఇదే సర్వేనెంబరులో తమకు భూమి ఉందని చివుకుల సుదర్శనం చెబుతున్నారు. విస్తీర్ణంలో స్పష్టత లేదు. దీంతో వివాదంగా మారింది. ఈ భూమి విలువైనది కావడంతో పేచీలకు దారితీసింది. కోర్టుల్లోనూ కేసుల్లో ఉంది. అయితే పరిష్కారం దొరకలేదని సుదర్శనం అనంతపురం జిల్లాకు చెందిన ఫ్యాక్షనిస్టులను ఆశ్రయించారు. ఇదే ఇక్కడ ఆందోళన కలిగిస్తోంది. ఇక్కడ భూవిదాలాలో అనంతపురం జిల్లాకు చెందిన కీలక నేతలు జోక్యం చేసుకోవడం కలకలం రేపింది. ఇక్కడ పాలకపక్ష నేతలకూ సమాచారం ఉందో లేదో స్పష్టత లేదు. ఇక్కడ నుంచే కొందరు మధ్యవర్తులు ఈ భూవివాదంలో బాధితులుగా ఉన్న వారిని అనంతపురం జిల్లాకు చెందిని జేసీ ప్రబాకర్‌రెడ్డి ముఠాకు పరిచయం చేసినట్లు చెబుతున్నారు. దీనిపై పోలీసులూ ఆరా తీస్తున్నారు. ఒంగోలులో నిత్యం భూవివాదాలు ఎక్కడో చోట తెరపైకి వస్తూనే ఉన్నాయి. దొంగ జీపీలు అడ్డంపెట్టుకోవడం, నకిలీపత్రాలతో రిజిస్ట్రేషన్లు వంటివి పెద్దఎత్తున సాగాయి. ఎన్నికలకు ముందు ఈ పరిణామాలు తీవ్ర ఆందోళన కలిగించాయి. అప్పటి ప్రభుత్వం దీనిపై సిట్ కూడా వేసింది. రెండొందలకుపైగానే అర్జీలు వచ్చాయి. ఎన్నికలు రావడంతో ఆ వ్యవహారం మరుగున పడింది. వివాదాలు మాత్రం అలాగే ఉన్నాయి. పరిష్కారాల కోసం పంచాయతీలు నడుస్తున్నాయి. ఇటీవల కొన్ని కీలక భూములను నేతలు సెటిల్ చేశారు. వాటిల్లో వెంచర్లు వేస్తున్నారు. కొనుగోళ్లకు రంగం సిద్ధమైంది. ఇంకా అనేక వివాదాలు పరిష్కారాల కోసం ఎదురుచూస్తున్నాయి. ఇదే క్రమంలోనే ఈ వివాదాలు వెలుగుచూస్తున్నాయి. కోర్టుల చుట్టూ తిరగలేకనే మొన్న సుజాతనగర్‌లో తమకు చెందిన ప్లాట్లను కొందరు యజమానులు ఆక్రమించి నిర్మాణాలు చేపట్టారు. అక్కడా ఇరువర్గాల మధ్య వివాదాలు కొనసాగుతూనే ఉన్నాయి. పట్టణంలో భూ సమస్యలపై ఇప్పటికైనా పోలీసులు దృష్టిసారించాలి. లేకుంటే ఫ్యాక్షనిస్టులు, మాఫియాలు జోక్యం చేసుకుంటే శాంతిభద్రతలకు సవాలుగా మారే ప్రమాదం ఉంది.

గ్రానైట్ ఫ్యాక్టరీల బంద్‌తో.. రోడ్డున పడిన కార్మికులు

(మొదటి పేజీ తరువాయి)

పడుతుంది. ఈలోగా ఫ్యాక్టరీలు నడపాలన్న కష్టం. కార్మికులు వెళ్లిపోతే వారు తిరిగి రావాలన్నా కష్టమని, తీవ్రంగా నష్టపోవాల్సి వస్తుందని ఫ్యాక్టరీ యజమానులు తలలు పట్టుకున్నారు.

ఎన్నికల సమయంలో చీమకుర్తి గ్రానైట్ పరిశ్రమను ఆదుకుంటామని, ప్రోత్సాహకాలు ఇస్తామని ఎన్నెన్నో వాగ్దానాలు చేసిన ప్రజా ప్రతినిధులు నోరు మెదపటం లేదు. పరిశ్రమను ఆదుకోకపోగా భారాలు మోపటం ఎక్కువయింది. దీంతో అటు యజమానులు ఇటు కార్మికులు తీవ్ర నష్టాలు పాలు అయ్యే అవకాశం ఉంది. చీమకుర్తి, సంతనూతలపాడు, మద్దిపాడు, గ్రోత్ సెంటర్ ప్రాంతాలలో దాదాపు 1200 పైగా చిన్న, పెద్ద గ్రానైట్ ఫ్యాక్టరీలు ఉన్నాయి. వీటిపై దాదాపు 30 వేల మంది పైగా కార్మికులు, ఉద్యోగులు, ఇతర వృత్తుల వారు ఆధారపడి జీవిస్తున్నారు. ఫ్యాక్టరీలకు రాళ్లను తరలించే ట్రాలీలు, లారీలు, టిప్పర్లు దాదాపు 200 పైగా ఉన్నాయి. వాటి మీద దాదాపు రెండువేల మంది ప్రత్యక్షంగా పరోక్షంగా ఆధారపడి జీవిస్తున్నారు. ఎందరికో ఉపాధిని కల్పిస్తున్న, నిరుద్యోగ సమస్యలు తీరుస్తున్న గ్రానైట్ పరిశ్రమను ఆదుకోవాల్సిన అవసరం ప్రభుత్వంపై ఉంది. ఇప్పటికైనా ప్రభుత్వం స్పందించి సీనరేజీ సమస్యను పరిష్కరించాలని, ప్రోత్సాకాలిచ్చి గ్రానైట్ పరిశ్రమల ఆదుకోవాలని ఫ్యాక్టరీ యజమానులు, కార్మికులు కోరుతున్నారు.

ఫ్యాక్టరీ యజమానులకు ఎడ్జ్ కటింగ్ ఓనర్ల సంఘీభావం

ప్రజాశక్తి-చీమకుర్తి


సంఘీభావం తెలుపుతున్న ఎడ్జ్ కటింగ్ యజమానుల సంఘాల నేతలు

గత ఐదు రోజులుగా సేనరేజ్ వసూల్ ప్రైవేట్ సంస్థకు అప్పగించడానికి నిరసిస్తూ గ్రానైట్ ఫ్యాక్టరీ యజమానుల చేస్తున్న సమ్మెకు చీమకుర్తి ఏరియా ఎడ్జ్ కటింగ్ యజమానుల సంఘం సంఘీభావం తెలిపింది. ఆదివారం సాయంత్రం ఏర్పాటు చేసిన కార్యక్రమంలో ఎడ్జ్ కటింగ్ సంఘాల నాయకులు మాట్లాడుతూ గ్రానైట్ పరిశ్రమ తీవ్ర సంక్షోభంలో కొట్టుమిట్టాడుతున్న సమయంలో రాష్ట్ర ప్రభుత్వం నిర్ణయాలు పరిశ్రమ మనుగడకే ప్రశ్నార్థకంగా మారిందని పేర్కొన్నారు. గ్రానైట్ పరిశ్రమపై ఆధారపడి ఎడ్జ్ కటింగ్ మిషన్లు నడుపుకుంటున్న దాదాపు 2000 కుటుంబాలు ఆధారపడి జీవిస్తున్నాయని పేర్కొన్నారు. పరిశ్రమపై భారాలు మోపడం వలన ఫ్యాక్టరీలు మూతపడే పరిస్థితి ఏర్పడిందని తెలిపారు. రాష్ట్ర ప్రభుత్వం జోక్యం చేసుకొని పెంచిన రాయల్టీని తగ్గించడంతోపాటు, రాయల్టీ వసూలు ప్రైవేటు సంస్థకు అప్పగించడాన్ని వెనక్కి తీసుకోవాలని పరిశ్రమను ఆదుకోవాలని వారి కోరారు. అభివృద్ధికి ప్రోత్సాహకాలు ఇవ్వాలని కోరారు. ఫ్యాక్టరీ యజమానులు తీసుకునే నిర్ణయానికి తాము పూర్తి సహకారం అందిస్తామని, ప్రభుత్వం సమస్యల పరిష్కారానికి కృషి చేయాలని పేర్కొన్నారు. కార్యక్రమంలో ఎడ్జ్ కటింగ్ యూనియన్ అధ్యక్షుడు బి వెంకట కొండయ్య, ఉపాధ్యక్షులు ఐ బుల్లియ, చంద్ర, శివ పాల్గొన్నారు.

జీవో 5పై స్టేటస్ కోను స్వాగతిస్తున్నాం

ప్రజాశక్తి - ఒంగోలు కలెక్టరేట్

కాపు, బలిజ వర్గాలకు బిసి రిజర్వేషన్ ఇవ్వాలని రాష్ట్ర కాపు జెఎసి అధ్యక్షులు చందు జనార్ధన్ డిమాండ్ చేశారు. దొమ్మరులను గిరి బలిజగా మారుస్తూ ఇచ్చిన జీవో 5 పై స్టేటస్ కో ఇవ్వటాన్ని కాపు జెఎసి స్వాగతించింది. రాష్ట్ర పర్యటనలో భాగంగా చందు జనార్దన్ ఒంగోలులో జిల్లా కాపు సంఘ కార్యాలయంలో జరిగిన సమావేశంలో పాల్గొన్నారు. తొలుత వంగవీటి రంగా విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. వంగవీటి రంగా ఆశయ సాధనకు కృషి చేస్తామని వారు తెలియజేశారు. అనంతరం పాత్రికేయుల సమావేశంలో రాష్ట్ర కాపు జెఎసి అధ్యక్షులు చందు జనార్ధన్ మాట్లాడుతూ దశాబ్దాల కాలం నుండి కాపు, తెలగ, బలిజ ఒంటరి కులాలకు బిసి రిజర్వేషన్ అంశం పెండింగ్‌లో ఉందన్నారు. దొమ్మరులను గిరిబాలిజ లు గా మారుస్తూ జీవో నెంబర్ 5పై స్టేటస్ కో తెచ్చేందుకు కృషి చేసిన ముఖ్య మంత్రి నారా చంద్రబాబు నాయుడు, ఉపముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్ మంత్రి నారా లోకేష్, బిసి సంక్షేమ శాఖ మంత్రి సవిత, ఆ శాఖ కార్యదర్శి ఎస్ సత్యనారాయణ, రాజ్య సభ సభ్యులు సానా సతీష్‌కి ధన్యవాదాలు తెలియజేశారు. సమావేశంలో శ్రీకృష్ణ దేవరాయ ఉద్యోగ జేఏసీ కన్వీనర్ సోమరౌతు రామకృష్ణ, ప్రకాశం జిల్లా కాపు సంఘం అధ్యక్షులు కొక్కిరాల సంజీవ్ కుమార్, నారపు శెట్టి రామ్మోహన్, పొత్తూరి రాజ్య సులోచన, నల్లంశెట్టి హనుమంతరావు, సూరినేని పోలేరయ్య, తోట నారాయణ, తోట రామారావు, చింతపల్లి నారాయణ, మేకల నారాయణ, రేకపల్లి శ్రీనివాసరావు పాల్గొన్నారు.

సఫాయి కర్మచారులకు పునరావాసం కల్పించాలి

ప్రజాశక్తి - బాపట్ల జిల్లా

సఫాయి కర్మచారులు ఆ వృత్తిని వదిలి పెట్టే లా పునరావాసం కల్పించాలని జిల్లా కలెక్టర్ డాక్టర్ వి.వినోద్ కుమార్ తెలిపారు. సఫాయి కర్మచారుల పునరావాస చట్టం అమలు తీరుపై జిల్లా కలెక్టర్ సమీక్ష చేశారు. పట్టణ, గ్రామీణ ప్రాంతాలలో సఫాయి కర్మచారులు ఉంటే అధికారికంగా నివేదించాలని కలెక్టర్ చెప్పారు. ఆ వృత్తిలో నుంచి వారిని బయటికి తీసుకు రావడానికి ప్రభుత్వం చర్యలు తీసుకుంటుంద న్నారు. అధునాతన సాంకేతిక పరిజ్ఞానంతో రూ పొందించిన యంత్రాలను ఉపయోగిం చాలని సూచించారు. డివిజన్ స్థాయిలో సఫా యి కర్మ చారుల కమిటీ సమావేశాలు విధిగా నిర్వహించా లన్నారు. డివిజన్ స్థాయి కమిటీలు ఇప్పటివరకు జరగకపోవడం ఏమిటని ప్రశ్నిం చారు. వీరి జీవన ప్రమాణాలు మెరుగుపడ డానికి పునరావాస కార్యక్రమాలు చేపట్టాలని సూచించారు.

వైద్య, విద్య రంగాలను ప్రభుత్వమే కొనసాగించాలి

ప్రజాశక్తి-ఒంగోలు సిటీ : వైద్య, విద్యా రంగాలను ప్రభుత్వ ఆధీనంలోనే కొనసాగించాలని, కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు తలపెట్టిన పీపీపీ విధానాన్ని తక్షణమే రద్దు చేయాలని పలు విద్యార్థి, ప్రజా సంఘాలు డిమాండ్ చేసాయి. ఆదివారం ఒంగోలు ఎంసీఏ భవన్‌లో ప్రగతిశీల ప్రజాస్వామ్య విద్యార్థి సంఘం (పిడిఎస్‌యు) ఆధ్వర్యంలో జరిగిన రౌండ్‌టేబుల్ సమావేశంలో సంఘ రాష్ట్ర ఉపాధ్యక్షుడు ఎల్.రాజశేఖర్ మాట్లాడుతూ ఆంధ్రప్రదేశ్‌లో కేంద్ర ప్రభుత్వం ప్రకటించిన 17 కొత్త మెడికల్ కళాశాలలో దాదాపు 80 శాతం నిర్మాణం పూర్తయిందని, మిగిలిన 20 శాతం పనులను ప్రైవేటు కంపెనీలకు అప్పగించడం దారుణం అన్నారు. ప్రభుత్వాలు సవైద్య విద్యా రంగాన్ని వ్యాపారవేత్తల చేతుల్లోకి నెట్టివేయడానికి కుట్ర పన్నుతున్నాయని ఆరోపించారు. జీవో నంబర్ 107, 108ల ద్వారా సెల్ఫ్ ఫైనాన్స్ సిస్టమ్‌ను ప్రవేశపెట్టి విద్యార్థులపై లక్షల రూపాయల ఫీజుల భారాన్ని మోపడం అన్యాయమని రాజశేఖర్ విమర్శించారు. భారత విద్యార్థి సమాఖ్య (ఎస్‌ఎఫ్‌ఐ) జిల్లా నాయకుడు చి.వినోద్ మాట్లాడుతూ జిల్లాకు కేటాయించిన యూనివర్సిటీ, ట్రిపుల్‌ఐటీల నిర్మాణం ఇంకా ప్రారంభం కాలేదన్నారు. సిపిఎంఎల్ రెడ్‌స్టార్ జిల్లా కార్యదర్శి భీమవరపు సుబ్బారావు, ఐఫియా నాయకులు పి.వి.సుబ్బారావు, ఏపీ జేఏసీ రాష్ట్ర అధ్యక్షుడు రాయపాటి జగదీష్, హేతువాద సంఘం రాష్ట్ర అధ్యక్షుడు బేగ్, కే.ఎన్.పి.ఎస్ జిల్లా కార్యదర్శి జార్జి, ఐఎఫ్టీయూ రాష్ట్ర నాయకుడు ఆర్.మోహన్, ఏపీటీఎఫ్ జిల్లా కార్యదర్శి లక్ష్మీనారాయణ, సమాజ్‌వాజ్ పార్టీ నాయకుడు కార్తీక్, సామాజిక కార్యకర్త శివరావు, ప్రగతిశీల యువజన సంఘం నాయకులు సుధాకర్, సచిన్, ప్రేమ్ కుమార్, సిపిఐ నాయకుడు సలార్ తదితరులు పాల్గొన్నారు.

స్కాలర్‌షిప్ అందక ఇక్కట్లు

(మొదటి పేజీ తరువాయి)

కూటమి ప్రభుత్వం స్కాలర్ షిప్పుల కోసం రూ.3,377 కోట్లు బడ్జెట్ కేటాయించింది. ఈ రెండేళ్ల కాలంలో స్కాలర్‌షిప్పుల కోసం కేటాయించిన బడ్జెట్ మొత్తం ప్రభుత్వాలు ఖర్చు చేసాయా? వేరే ఇతర ఖర్చులకు బదలాయించారా? అన్నది ప్రశ్నర్ధకంగా మారింది. బడ్జెట్ మొత్తం స్కాలర్షిప్‌కు కేటాయిస్తే ఇంతపెద్ద ఎత్తున బకాయిలు నిలిచిపోవని విద్యార్థి సంఘాల నాయకులు అభిప్రాయపడుతున్నారు. మరో నాలుగైదు నెలల్లోనే 2026–2027 బడ్జెట్ రూపొందించవలసిన తరుణంలో విద్యార్థుల పెండింగ్ స్కాలర్‌షిప్ విడుదల చేయాలని పలు విద్యార్థి సంఘ నాయకులు డిమాండ్ చేస్తున్నారు.

బడ్జెట్ విడుదల కాగానే పంపిణీ చేస్తాము..

- ఎన్.లక్ష్మా నాయక్, డిప్యూటీ డైరెక్టర్ సాంఘిక సంక్షేమ శాఖ

జిల్లాకు సంబంధించిన స్కాలర్షిప్ బడ్జెట్ విడుదల కాగానే విద్యార్థుల ఖాతాల్లో జమ చేస్తాము. నిధులు మంజూరు కాగానే పంపిణీకి చర్యలు తీసుకుంటాము.

పెండింగ్ బకాయిలు రూ.6,400 కోట్లు

- సిహెచ్ వినోద్, ఎస్ఎఫ్ఐ జిల్లా నాయకులు..

కాలేజీలకు చెల్లించాల్సిన బకాయిలు పెండింగ్ ఉండటంతో వాటి భారం విద్యార్థులపై పడుతోంది. విద్యార్థులు ఫీజులు చెల్లించడానికి ఆటోలు తోలడం, స్విగ్గీ, జోమోటో, రేపిడో వంటి పార్ట్ టైం జాబ్‌లు చేసి ఫీజులు చెల్లించుకుంటున్నారు. కాలేజీ చదువు పూర్తయ్యాక ఫీజు చెల్లించక సర్టిఫికెట్లు అందక, జాబ్ మేళాలు నిర్వహించినప్పుడు హాజరు కాలేక నిరుద్యోగులుగా మిగిలిపోతున్నారు.

జీవో 77ను తక్షణమే రద్దు చేయాలి

- ఎల్.రాజశేఖర్, పిడిఎస్‌యు రాష్ట్ర ఉపాధ్యక్షులు

పీజీ విద్యార్థులకు రీయింబర్స్‌మెంట్ దూరం చేసే జీవో నెంబర్ 77ను తక్షణమే రద్దు చేయాలి. పెండింగ్‌లో ఉన్న రూ.6400 కోట్ల ఫీజు బకాయిలను విడుదల చేయాలి.

ఆ భూమిపై సర్వ హక్కులు మావే..

దళిత నేత నీలం నాగేంద్రరావు

ప్రజాశక్తి-ఒంగోలు కలెక్టరేట్

పేర్నమిట్ట సర్వే నెంబర్ 148/2 లోని 1 ఎకరా 4 సెంట్ల రిజిస్టర్ భూమి తమదేనని దళిత హక్కుల పరిరక్షణ సమితి రాష్ట్ర అధ్యక్షులు నీలం నాగేంద్రరావు తెలిపారు. మాజీ శాసనసభ్యుడు జెసి ప్రభాకర్ రెడ్డి వాస్తవాలు తెలుసుకొని మాట్లాడాలని ఆయన సూచించారు. ఒంగోలు మీడియా కెమెరామెన్ అసోసియేషన్ భవన్‌లో ఆదివారం జరిగిన ప్రెస్‌మీట్‌లో నీలం నాగేంద్రరావు మాట్లాడుతూ పెద్దిరెడ్డి సూర్య ప్రకాష్ రెడ్డి, చివుకుల సుదర్శనం సంతనూతలపాడు సబ్ రిజిస్ట్రార్ కార్యాలయంలో తీసుకున్న సర్టిఫైడ్ కాపీలు చూపిస్తున్నారే తప్ప, ఒరిజినల్ డాక్యుమెంట్లు, లింకు డాక్యుమెంట్లు లేవన్నారు. వివాదం సృష్టించి, సెటిల్‌మెంట్ డబ్బు కోసం ఆశపడ్డారన్నారు. భూమి రికార్డులు పుట్టిన 1905లో ఈ భూమి పేర్నమిట్టకు చెందిన రావూరి లింగారెడ్డిదని, అతని వద్ద నుంచి తన తాత రోశయ్య సర్వేనంబర్ 148/2 లోని 1 ఎకరా 80 సెంట్ల భూమి కొనుగోలు చేశారన్నారు. 1930లో సివిల్ దావాలో తమ భూమి వేలానికి వచ్చిందనేది ఎంత నిజమో, వేలం అమలు కాలేదని, భూమి స్వాధీనం చేయబడలేదనేది అంతే నిజమన్నారు. తన తాత నీలం రోశయ్య 12 రూపాయలు బాకీ చెల్లించలేదని మొహిద్దీన్ అనే వ్యక్తి ఒంగోలు డిస్ట్రిక్ట్ మున్సిపల్ కోర్టులో స్మాల్ కాజ్ దావా వేసి డిక్రీ పొందారన్నారు. 1929లో ఎగ్జిక్యూటివ్ పిటిషన్ వేశారని, 1930లో వేలంపాట నిర్వహించారన్నారు.

ప్రజాశక్తి 3
సోమవారం 6 అక్టోబర్ 2025

వినతులు స్వీకరించిన మంత్రి స్వామి

ప్రజాశక్తి-టంగుటూరు

టంగుటూరు మండలం తూర్పునాయుడుపాలెంలోని తన క్యాంపు కార్యాలయంలో మంత్రి డాక్టర్ డోలా శ్రీ బాల వీరాంజనేయ స్వామి ప్రజల నుంచి ఆదివారం వినతులు స్వీకరించారు. సంబంధిత అధికారులతో మాట్లాడి కొన్ని సమస్యలు పరిష్కరించారు. సమస్యల పరిష్కారానికి కూటమి ప్రభుత్వం కృషి చేస్తున్నట్లు మంత్రి స్వామి తెలిపారు.

వైసిపి, సిపిటియుసి కార్యదర్శిగా వెంకయ్య

ప్రజాశక్తి-టంగుటూరు



టంగుటూరు మండలం కందులూరు గ్రామానికి చెందిన వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ యువ నాయకులు మన్నం వెంకయ్యకు వైఎస్ జగన్మోహన్‌రెడ్డి వైఎస్సార్ సీపీటియుసి రాష్ట్ర కార్యదర్శిగా నియమించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ గతంలో ఇండియన్ నేషనల్ కాంగ్రెస్ పార్టీ టంగుటూరు మండల అధ్యక్షులు గాను, వైసీపి కాంగ్రెస్ పార్టీలో జిల్లా ప్రచార కమిటీ కార్యదర్శిగా పని చేసినట్లు తెలిపారు. వీరి అనుభవాన్ని గమనించిన కొండేపి నియోజకవర్గ ఇన్‌ఛార్జి, మాజీ మంత్రి డాక్టర్ ఆదిమూలపు సురేష్ ఈ రాష్ట్ర పదవి వచ్చేందుకు తన సహాయ సహకారాలు అందించారు. అదేవిధంగా మండల అధ్యక్షులు చింతపల్లి హరిబాబు, ఉప్పలపాటి రామరాజుతో పాటు వివిధ స్థాయి నాయకులు వారిని అభినందించారు.



నిరసన తెలుపుతున్న సిపిఎం నాయకులు

రోడ్డు నిర్మించాలని సిపిఎం నిరసన

ప్రజాశక్తి-కొండపి

కొండపిలోని మద్దులూరు రోడ్డులో ఎన్టీఆర్ బొమ్మ సెంటర్ నుంచి అనకర్లపూడి వరకు రోడ్డు నిర్మాణం వెంటనే చేపట్టాని సిపిఎం డిమాండ్ చేసింది. కొండేపి నుంచి వయా మద్దులూరు వరకు రోడ్డు నిర్మాణం చేపట్టాలని ఆదివారం సిపిఎం ఆధ్వర్యంలో నిరసన కార్యక్రమం చేశారు. ఈ సందర్భంగా సిపిఎం జిల్లా నాయకులు కేజీ మస్తాన్ మాట్లాడుతూ కొండేపి నుంచి వయా మద్దులూరు రోడ్డు 1982లో వేశారు. అప్పటి నుంచి కొన్ని సందర్భాల్లో మాత్రమే తారు రోడ్డు వేశారన్నారు. సుమారు 15 సంవత్సరాల నుంచి తారు రోడ్డు కాస్తా మట్టి రోడ్డుగా మారిపోయి గుంతలమయం కావటం ప్రయాణికులు అనేక ఇబ్బందులకు గురవుతున్నారని ఆయన అన్నారు. వాహనదారులకు ఆ రోడ్లో ప్రయాణం అంటే నరకంతో సమానం అన్నట్లుగా ఉందన్నారు. ఇప్పటికైనా ప్రజాప్రతినిధులు, ప్రభుత్వ అధికారులు స్పందించి రోడ్డుకు మరమ్మతు చేయించాలని కోరారు. ఈ కార్యక్రమంలో సిపిఎం కొండేపి శాఖ కార్యదర్శి వై రూబెన్, శివ, ఆర్ వెంకట్రావు, ఆచారి, సుశీలమ్మ, కిరణ్ తదితరులు పాల్గొన్నారు.

అనుమానస్థితితో విద్యార్థిని మృతి

ప్రజాశక్తి-పెద్దదోర్నాల



మృతదేహాన్ని పరిశీలిస్తున్న పోలీసులు

అనుమాన స్థితిలో విద్యార్థిని మృతి చెందారు. ఈ సంఘటన మండలంలోని రామ చంద్రకోట సమీపంలోని జరిగింది. మృతిచెందిన విద్యార్థిని చింతల అగ్రహారం గ్రామానికి చెందిన కోలా శేఖర్ కుమార్తె సునీత(17)గా పోలీసులు గుర్తించారు. వారం రోజులుగా తమ కుమార్తె కనిపించడం లేదని తల్లిదండ్రులు పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. సునీత త్రిపురాంతకం మండలంలో ఇంటర్ రెండో సంవత్సరం చదువుతున్నది. దసరా సెలవుల నిమిత్తం ఇంటికి వచ్చింది. ఎస్ఐ వి మహేష్ కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

చెడిపోయిన రొయ్యలు

- కోటి రూపాయల నష్టంలో రైతు
- ప్రభుత్వం ఆదుకోవాలని వేడుకోలు

ప్రజాశక్తి-శింగరాయకొండ



పూర్తిగా చెడిపోయిన రొయ్యలు

అసలే అమెరికాలో ట్రంప్ దెబ్బకు ఇక్కడ రొయ్యల రైతు వెన్నులో వణుకు పుడుతోంది. ఈ సమయంలో రొయ్యలు చెడిపోయి కోట్ల రూపాయలు రైతుకు నష్టం వచ్చిన సంఘటన శింగరాయకొండ మండలం పాకల గ్రామ పంచాయతీ పరిధిలోని పల్లెపాలెం సముద్ర తీరాన రొయ్యల చెరువుల దగ్గరలో చోటుచేసుకుంది. నెల్లూరు జిల్లా కావలి దగ్గరలోని రుద్రకోట గ్రామానికి చెందిన కిన్నెర సుధాకర్‌రావు అనే రైతు పల్లెపాలెం దగ్గరలో నాలుగు చెరువుల్లో రొయ్యలు సాగు చేశాడు. అయితే ఈ నెల ఒకటో తేదీన రాత్రి సమయంలో రొయ్యల చెరువుల దగ్గర కరెంటు పోవడంతో వెంటనే కరెంటు వచ్చిందని అక్కడ జనరేటర్ ఆన్ చేయకపోవడంతో ఆ రైతుకు తీవ్ర నష్టం వాటిల్లింది. రొయ్యల చెరువులో 24 గంటల పాటు ఫ్యాన్లు తిరగాల్సి ఉంటుంది. కరెంటు పోయినప్పుడు జనరేటర్ ద్వారా అయినా ఫ్యాన్లు తిరగాల్సి ఉండగా ఆ ఫ్యాన్లు వేయకపోవడంతో రొయ్యలు పూర్తిగా దెబ్బతిన్నాయి. 50 కౌంటు అరవై కౌంటు డెబ్బై కౌంటు 80 కౌంటులో ఉన్న ఈ నాలుగు చెరువుల్లో నాలుగు రకాల కౌంట్‌లో ఉన్న రొయ్యలు పూర్తిగా దెబ్బతినిపోయాయి. సుమారు కోటి రూపాయల వరకు నష్టం జరిగిందని రైతు కిన్నెర సుధాకర్‌రావు వాపోతున్నారు. రొయ్యల చెరువులకు కరెంటు 24 గంటలు ఉండాల్సి ఉండగా అలా లేకపోవడం ద్వారా ఈ నష్టం జరిగిందని వాపోతున్నారు. అసలే ఫ్యాక్టరీ యాజమానులు రొయ్యలు కొనే పరిస్థితిలో లేకపోవడంతో ఎలాగైనా అమ్ముడుపోతాయన్న ఆశతో నాలుగు చెరువులు వేసి కోటి రూపాయలు పైగా నష్టంలో పడిపోయానని, ప్రభుత్వం ఆదుకోవాలని కోరుతున్నారు. రొయ్యల చెరువులో ఉన్న రొయ్యలు పూర్తిగా రంగు మారిపోయి దెబ్బతిన్నాయన్నారు. తనను ప్రభుత్వం ఆదుకొని న్యాయం చేయాలని రైతు సుధాకర్‌రావు వాపోతున్నారు.

వైవీ, సురేష్‌ను కలిసిన కొండపి వైసీపీ నేతలు

ప్రజాశక్తి-కొండపి



ఆదిమూలపు సురేష్‌ను పరామర్శిస్తున్న వైసీపీ సీనియర్ నాయకులు

వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ సీనియర్ నేత రాజ్యసభ సభ్యుడు వైవి సుబ్బారెడ్డిని కొండపి వైసీపీ నేతలు ఆదివారం హైదరాబాదులోని ఆయన నివాసంలో మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా ఆయనతో కలిసి కొండెపి నియోజకవర్గంలో పార్టీ బలోపేతానికి కషి చేయాల్సిన అంశాలను గురించి చర్చించారు. అనంతరం పుష్పగుచ్ఛంతో శాలువాతో ఘనంగా సన్మానించారు. తదనంతరం అనారోగ్య కారణాల రీత్యా హైదరాబాదులో విశ్రాంతి తీసుకుంటున్న వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీ పీఏసీ సభ్యుడు, మాజీ మంత్రి, కొండపి నియోజకవర్గ ఇన్‌చార్జ్ డాక్టర్ ఆదిమూలపు సురేష్‌ను మర్యాదపూర్వకంగా కలిసి పరామర్శించారు. ఆరోగ్య వివరాలను అడిగి తెలుసుకుని త్వరగా కోలుకొని నియోజకవర్గానికి సంపూర్ణ ఆరోగ్యంతో తిరిగి రావాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో కొండపి మండల సీనియర్ నాయకుడు మండవ మాలకొండయ్య, సింగరాయకొండ మండల అధ్యక్షుడు మసనం వెంకటరావు, నియోజకవర్గ బీసీ సెల్ అధ్యక్షుడు యామవరపు వీర వసంతరావు, నియోజకవర్గ యువజన విభాగం అధ్యక్షుడు మారంరెడ్డి గంగాధర్ రెడ్డి, రాష్ట్ర ఎస్సీ సెల్ జాయింట్ సెక్రటరీ సుదర్శి వెంకటరావు, మాదాల వేణు, కే నర్సింహారావు తదితరులు పాల్గొన్నారు.

అంబేద్కర్ విగ్రహం దగ్ధంపై నిరసన

ప్రజాశక్తి-సంతనూతలపాడు



నిరసన నిర్వహిస్తున్న కార్యకర్తలు

అంబేద్కర్ విగ్రహం దగ్ధం ఘటనపై మండలంలోని ఎండ్లూరు గ్రామంలోని అరుంధతి నగర్‌లో అంబేద్కర్, జగ్జీవన్ రావ్ విగ్రహాల ప్రాంగణంలో ఆదివారం నిరసన కార్యక్రమం నిర్వహించారు. చిత్తూరు జిల్లా ఎదురుకుప్పం మండలం దేవళంపేట గ్రామంలో భారతరత్న డాక్టర్ బిఆర్ అంబేద్కర్ విగ్రహానికి నిప్పు పెట్టటం భారతదేశ ప్రజాస్వామ్యానికే అవమానకరమని బహుజన రచయితల వేదిక మాజీ జిల్లా అధ్యక్షులు అట్లూరి రామారావు అన్నారు. ఇలాంటి సంఘటనలు భారతదేశంలో కోకొల్లలుగా జరగడం మరింత దారుణమని అన్నారు. ఈ సందర్భంగా కెవిపిఎస్ జిల్లా అధ్యక్షులు అట్లూరి రాఘవులు మాట్లాడుతూ భారతదేశంలో బడుగు బలహీన వర్గాల ఆరాధ్య దైవం అయినటువంటి డాక్టర్ బిఆర్ అంబేద్కర్ విగ్రహానికి నిప్పు పెట్టటం దుర్మార్గమని ఆవేదన వ్యక్తం చేశారు. నిందితులపై కఠిన చర్యలు తీసుకోవాలని వారు డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో మాదిగ మహాసేన నాయకులు అట్లూరి రామయ్య, సుబ్బారావు, జక్కయ్య, సుష్మానంద్, అట్లూరి సింగయ్య తదితరులు పాల్గొన్నారు.

నిందితులపై కఠిన చర్యలు తీసుకోవాలి: మాల మహానాడు

చిత్తూరు జిల్లా, ఎదురు కుప్పం మండలంలోని దేవళంపేట గ్రామంలో అంబేద్కర్ విగ్రహాన్ని తగలపెట్టిన నిందితులపై కఠిన చర్యలు తీసుకోవాలని సంతనూతలపాడు మండల మాలమహానాడు నాయకులు ఆదివారం ఒక ప్రకటనలో డిమాండ్ చేశారు. మున్ముందు ఇటువంటి చర్యలకు పాల్పడకుండా నిందితులను తక్షణమే అరెస్టుచేసి వారిపై కఠిన చర్యలు తీసుకోవాలని మండల మాలమహానాడు నాయకులు ఇస్తర్ల శ్రీనివాసరావు, సంకె సుబ్బారావు, కారుమంచి నాగరాజు, మార్పుడి రమేష్, మార్పుడి రమణయ్య, చావా బత్తిన రాంబాబు, కోతి కోటేశ్వరరావు, దాసరి ప్రకాశం, సాదు కొండలరావు, అన్నవరపు పూర్ణచంద్రరావు, గొర్రెముచ్చు చేజర్లయ్య, బొంతా శ్రీనివాసరావు తదితరులు కోరారు.

మాజీ మంత్రి మేరుగు నాగార్జున ఖండన

చిత్తూరు జిల్లా వెదురుకుప్పం మండలం దేవళంపేటలో అంబేద్కర్ విగ్రహాన్ని పెట్రోల్ పోసి తగలబెట్టిన వారిని ప్రభుత్వం వెంటనే శిక్షించాలని వైసీపీ నియోజకవర్గ ఇన్‌చార్జ్, మాజీ మంత్రి మేరుగు నాగార్జున డిమాండ్ చేశారు. ఆదివారం నాడు ఆయన ఒక ప్రకటన విడుదల చేశారు. కూటమి సర్కారులో దళితులపై నిత్యం దాష్టికాలేనని అన్నారు. ఈ ఘటనకు కారణమైన టీడీపీ నేత సతీష్ నాయుడిని అరెస్టు చేయాలని డిమాండ్ చేశారు. రాష్ట్రంలో దళితుల గ్రామ బహిష్కరణలు, అంబేద్కర్ విగ్రహాలకు అపచారం నిత్య కత్యమైందని విమర్శిం చారు. ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు దళిత ద్రోహిగా చరిత్రలో నిలిచిపోతాడని అన్నారు. అంబేద్కర్ భావజాలాలపై టీడీపీ ఆది నుంచి విషం చిమ్ముతోందని మండిపడ్డారు. ఇలాంటి ఘటనలు జరగకుండా కూటమి ప్రభుత్వం జాగ్రత్తలు తీసుకోవాలని, దళితుల ఆత్మగౌరవం దెబ్బతినకుండా చూడాలని ఆయన కోరారు.

పెద్దపులి సంచారం.. రైతుల్లో ఆందోళన

ప్రజాశక్తి-పెద్దదోర్నాల



రైతులకు కనిపించిన పెద్దపులి

పెద్దపులి సంచారంతో రైతులు ఆందోళన చెందు తున్నారు. మండలం లోని పెద్ద బొమ్మలాపురం గ్రామానికి సమీపంలో గండి చెరువు ఉంది. అక్కడ నుంచి నల్లమల అటవీ ప్రాంతం మొదలవుతుంది. అక్కడ వరకు బొమ్మలాపురం గ్రామస్తులు పొలాలు చేసుకుని పంటలు వేసుకుంటున్నారు. ఆదివారం ఉదయం ట్రాక్టర్ పైన కొంతమంది రైతులు కూలీలను తీసుకొని వెళ్తుండగా గండి చెరువుపైన దేవులూటిగూడెం పరిసర ప్రాంతాలలో పెద్దపులి నడుచుకుంటూ వెళుతూ వీరికి కనిపించింది. దీంతో ట్రాక్టర్‌పై వెళ్తున్న రైతులు పులిని సెల్ ఫోన్ ద్వారా వీడియోలు తీశారు. అనంతరం భయపడి ముందుకు వెళ్లలేక తిరిగి గ్రామానికి చేరుకున్నారు. ఈ విషయాన్ని అటవీ శాఖ అధికారులు దృష్టికి తీసుకెళ్లారు. దీంతో అటవీ శాఖ అధికారులు వెంటనే చర్యలు చేపట్టారు. ఫారెస్ట్ రేంజర్ హరి మాట్లాడుతూ పెద్దపులి ఆ ప్రాంతంలో సహజ సిద్ధంగా సంచరిస్తోందని, రైతులు ఎవరూ ఇబ్బంది పడాల్సిన అవసరం లేదని, దాని దగ్గరికి ఎవరు వెళ్ళవద్దని అన్నారు. గతంలో కూడా ట్రాప్‌లో పరిశీలించినట్లు తెలిపారు. రైతులకు అవగాహన కల్పించి ప్రత్యేక చర్యలు చేపడతామని తెలిపారు.

80 బస్తాల చౌక బియ్యం పట్టివేత

ప్రజాశక్తి-టంగుటూరు

జరుగుమల్లిలో పోలీసు స్టేషన్ సెంటరు వద్ద నున్న వైఎస్ఆర్ విగ్రహం వద్ద జరుగుమల్లి ఎస్ఐ మహేంద్ర అక్రమంగా లారీలో తరలిస్తున్న 80 బస్తాల చౌక ధరల దుకాణం బియ్యాన్ని పట్టుకున్నారు. ఎపి 39యువై2576 నంబరు గల మినీ లారీ కామేపల్లి వైపు నుంచి టంగుటూరు వైపు శనివారం రాత్రి వెళుతుండగా వైఎస్ఆర్ విగ్రహం వద్ద లారీని పట్టుకొని ఎస్ఐ స్వాధీనం చేసుకొని కేసు నమోదు చేశారు.

ముమ్మరంగా పోలీసు తనిఖీలు

ప్రజాశక్తి-శింగరాయకొండ

శింగరాయకొండలో ఆదివారంనాడు పోలీసులు ముమ్మరంగా తనిఖీలు చేపట్టారు. జిల్లా ఎస్పీ హర్షవర్ధన్ రాజు ఆదేశాల మేరకు సిఐ సిహెచ్ హజరత్తయ్య, ఎస్ఐ బి మహేంద్ర ఆధ్వర్యంలో రైల్వేస్టేషన్, బస్టాండు, శ్రీవరాహలక్ష్మి నరసింహస్వామి దేవస్థానంలో బాంబు స్క్వాడ్‌తో పాటు డాగ్ స్క్వాడ్ ద్వారా తనిఖీలు నిర్వహించారు. రైల్వే స్టేషన్‌లో బస్టాండ్‌లో బస్సులు, రైళ్లలో వెళుతున్న వారి వద్ద ఉన్న బ్యాగులను తనిఖీ చేశారు. శ్రీవరహాలక్ష్మి నరసింహస్వామి దేవస్థానం నాలుగు వైపులా బాంబు స్క్వాడు డాగ్స్ కార్డు ద్వారా తనిఖీలు చేపట్టారు.

పిడుగుపాటుకు ఆలయ గోపురం ధ్వంసం

ప్రజాశక్తి-పుల్లలచెరువు



దెబ్బతిన్న ఆలయ గోపురం

మండలంలోని ముటుకుల గ్రామంలో పిడుగుపాటుకు ఆలయ గోపురం పాక్షికంగా ధ్వంసమయింది. ఆదివారం మధ్యాహ్నం మూడు గంటల ప్రాంతంలో ఉరువులు మెరుపులతో కూడిన వర్షం కురిసింది. ఈ సమయంలో పిడుగు పడి ఆలయ గోపురం కొంతమేర పగిలి పోయింది. ముటుకుల గ్రామంలో 150 సంవత్సరాల క్రితం పోలయ్య అనే వ్యక్తిని గ్రామస్తులు దైవస్వరూపులుగా కొలిచేవారు. ఆయన జీవ సమాధి కావడంతో బస్టాండ్ సెంటర్లో ఆయనకు గుడి కట్టించారు. 150 సంవత్సరాల నుంచి పోలయ్య మఠం పూజలందుకుంటోంది. పిడుగు పడడంతో ఈ ఆలయ గోపురం ధ్వంసమైంది. ప్రాణనష్టం జరగకపోవడంతో ఊపిరి పీల్చుకున్నారు.



సిఎం సహాయ నిధి అందజేస్తున్న ఎమ్మెల్యే ఆనందబాబు

సీఎం సహాయనిధి అందజేత

ప్రజాశక్తి - భట్టిపోలు

నియోజకవర్గంలోని కొల్లూరుకు చెందిన 13 మంది అనారోగ్యంతో ప్రైవేట్ ఆస్పత్రిలో చికిత్స చేసుకున్నారు. చికిత్స కోసమైన ఆర్థిక వనరులను శాసన సభ్యులు నక్కా ఆనంద బాబు సీఎంఆర్ఎఫ్‌కు సిఫార్సు చేశారు. దీంతో మంజూరైన సిఎంఆర్ఎఫ్ నిధులను చెక్కు రూపంలో కొల్లూరు, క్రాప, బొద్దులూరుపాడు గ్రామాలకు చెందిన 13 మందికి రూ.5,67,029 ఆదివారం అందజేశారు. కార్యక్రమంలో వేమూరు ఎఎంసి చైర్మన్ గొట్టిపాటి పూర్ణ కుమారి, నాయకులు మైనను మురళీకృష్ణ, కనకాల మధుసూధన ప్రసాద్ పాల్గొన్నారు.



సురేష్‌ను పరామర్శిస్తున్న బూచేపల్లి శివప్రసాదరెడ్డి

సురేష్‌కు బూచేపల్లి పరామర్శ

ప్రజాశక్తి - దర్శి

ఇటీవల స్వల్ప అనారోగ్యం కారణంగా హైదరాబాద్‌లోని తన నివాసంలో విశ్రాంతి తీసుకుంటున్న మాజీ మంత్రి, వైసీపీ పిఎసి సభ్యులు, కొండేపి ఇంఛార్జి డాక్టర్ ఆదిమూలపు సురేష్‌ను దర్శి శాసనసభ్యులు, వైసిపి జిల్లా అధ్యక్షులు బూచేపల్లి శివప్రసాద్‌రెడ్డి ఆదివారం పరామర్శించారు. ఆయన వెంట బి వెంకటరెడ్డి ఉన్నారు.



చిన్నారిని ఆశీర్వదిస్తున్న ఎఎంసి చైర్మన్ రమ శ్రీనివాసులు

పుష్పాలంకరణ వేడుకల్లో ఎఎంసి చైర్మన్

ప్రజాశక్తి - పామూరు

మండలంలోని కంబాలదిన్నె గ్రామంలోని నల్లబోతుల శీను కుమార్తె పుష్పాలంకరణలో కనిగిరి ఎఎంసి చైర్మన్ యారవ రమ శ్రీనివాసులు, టిడిపి మండల అధ్యక్షులు బొల్లా నరసింహారావు, మోపాడు రిజర్వాయర్ చైర్మన్ చుంచు కొండయ్య, కంబాలదిన్నె టిడిపి అధ్యక్షులు మన్నం రమణయ్య, కస్టమర్ కో కన్వీనర్ గోళ్ల వీరబాబు, టిడిపి పట్టణ అధ్యక్షులు అమీర్ బాబు, ఉపాధ్యక్షులు ఈ కోటిరెడ్డి, కంబాలదిన్నె మాజీ సర్పంచ్ గోళ్ళ మాల్యాద్రి, ఏలూరి నరసింహ, కంబాలదిన్నె తెలుగు యువత అధ్యక్షులు ఏలూరి మాధవరావు, ఇ శ్రీనివాసులురెడ్డి, గోళ్ల రమణయ్య, గోళ్ల వీరాంజనేయులు, కుడారి బ్రహ్మయ్య, మల్లెల శ్రీనివాసులు పాల్గొన్నారు.

ట్రావెల్స్ దోపిడీని అరికట్టలేరా

ప్రజాశక్తి -సిఎస్‌పురం రూరల్

ప్రైవేట్ ట్రావెల్స్ దోపిడీని అరికట్టే వారు లేరా అంటూ ప్రజలు ప్రశ్నిస్తున్నారు. సిఎస్‌పురం నుంచి బెంగళూరు, హైదరాబాద్ ప్రాంతాలకు ప్రైవేట్ ట్రావెల్స్ బస్సులు నడుపుతున్నాయి. అయితే ఈ ప్రైవేట్ ట్రావెల్స్ అవకాశాన్ని బట్టి ప్రజల నుంచి అధిక చార్జర్ వసూలు చేస్తూ దోపిడీ చేస్తున్నారు. సిఎస్పురం నుంచి బెంగళూరుకు ఆర్టీసీ బస్సుల్లో రూ.715 చార్జి ఉండగా ప్రైవేట్ ట్రావెల్స్ సీటింగ్‌కు రూ.800, స్లీపర్ సీట్ రూ.900 నుంచి రూ.1100 వసూలు చేస్తురు. పండగల వేళల్లో ఈ చార్జీలు రెట్టింపు చేసి ప్రయాణికులను దోపిడీ చేస్తున్నారు. బెంగళూరుకు స్లీపర్ సీటు ఆదివారం రూ.2300, సిట్టింగ్ సీట్ రూ.1200 వసూలు చేసినట్లు ప్రయాణికులు తెలిపారు. టికెట్ రేట్లను ఆన్లైన్‌లో ఉంచి మరీ దోపిడీ చేస్తున్నా కూడా అధికారులు పట్టించుకోకపోవడంపై ప్రయాణికులు విస్మయం వ్యక్తం చేస్తున్నారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి ప్రైవేట్ ట్రావెల్స్ దోపిడీని అరికట్టాలని ప్రయాణికులు కోరుతున్నారు.

అంతర్జాతీయ ఉపాధ్యాయ దినోత్సవం



అద్దంకిలో ఉపాధ్యాయులను సన్మానిస్తున్న దృశ్యం

ప్రజాశక్తి - అద్దంకి

సాహితీ కౌముది ఆధ్వర్యంలో అంతర్జాతీయ ఉపాధ్యాయ దినోత్సవం పుట్టంరాజు కళాక్షేత్రంలో ఆదివారం ఘనంగా నిర్వహించారు. కుందా సుబ్బారావు సభాహ్వానం పలికారు. చప్పిడి వీరయ్య అధ్యక్షత వహించారు. ఎడ్యుకేషనల్ ఎపిఫని అధ్యక్షులు డాక్టర్ టి వెంకటరావు, విశ్రాంత ఉద్యోగుల సంఘ జిల్లా కార్యదర్శి కరి కమలేశ్వరరావు, శింగరకొండ దేవస్థానం చైర్మన్ చుండూరి మురళీ సుధాకరరావు, కెవి పోలిరెడ్డి మాట్లాడారు. ఉపాధ్యాయుల త్యాగ స్ఫూర్తి, సమాజ నిర్మాణంలో ఉపాధ్యాయుల పాత్రపై విలువైన సందేశం ఇచ్చారు. కె పాపారావు, సాహితీ కౌముది అధ్యక్షులు పుట్టంరాజు శ్రీరామచంద్రమూర్తి, కొండకావూరి కుమార్ పలువురు ఉపాధ్యాయులను సత్కరించారు. పుట్టంరాజు బుల్లెయ్య, రామలక్ష్మమ్మ ఉత్తమ ఉపాధ్యాయ పురస్కారం అందజేశారు. కార్యక్రమంలో డాక్టర్ యు దేవపాలన, వారణాసి రఘురామశర్మ, మలాది శ్రీనివాసరావు, నిమ్మరాజు నాగేశ్వరరావు, కూరపాటి రామకోటేశ్వరరావు, నర్రా గోపాల్, కె వెంకటేశ్వర్లు, ఎసిహెచ్ యోగయ్య, పి అంకయ్య, కందికంటి సత్యం, పాటిబండ్ల శ్రీమన్నారాయణ, పొన్నపల్లి బ్రహ్మానందం పాల్గొన్నారు.

మార్టూరు రూరల్ : అంతర్జాతీయ ఉపాధ్యాయ దినోత్సవం రోటరీ ఆధ్వర్యంలో ఆదివారం ఘనంగా నిర్వహించారు. స్థానిక నాగరాజుపల్లి రోడ్డులోని టీచర్స్ కాలనీలో 70 మంది మహిళా ఉపాధ్యాయులకు మొక్కలు పంపిణీ చేశారు. కార్యక్రమంలో రోటరీ అధ్యక్ష, కార్యదర్శులు మాదాల సాంబశివరావు, చెరుకూరి నాగేశ్వరరావు, గోనుగుంట్ల రవికుమార్, కుర్రా వెంకటరామయ్య, అసిస్టెంట్ గవర్నర్ రావి అంకమ్మ చౌదరి, జాస్తి సాంబశివరావు, తాళ్లూరి సాంబశివరావు, చెరుకూరి అంజిబాబు, గరిమిడి శ్రీనివాసరావు పాల్గొన్నారు.



మొక్కలు పంపిణీ చేస్తున్న రోటరీ ప్రతినిధులు

విద్యార్థులకు చిత్రలేఖన పోటీలు

ప్రజాశక్తి - ముండ్లమూరు

జన విజ్ఞాన వేదిక, అభ్యుదయ స్టడీ సర్కిల్ ఆధ్వర్యంలో శంకరాపురం ప్రాథమికోన్నత పాఠశాలలో ఇంగ్లీష్, తెలుగు మీడియం విద్యార్థినీ, విద్యార్థులకు గురజాడ అప్పారావు, గుర్రం జాషువ, మహాత్మగాంధీ మీద వ్యాస రచన, డిబేట్, చిత్రలేఖనం పోటీలు నిర్వహించి విజేత లైన విద్యార్థినీ, విద్యార్థులకు బహుమతులు అందజేశారు. జెవివి జిల్లా ప్రధాన కార్యదర్శి, ఉపాధ్యాయులు తంగ శ్రీనివాసరావు మాట్లాడారు. జెవివి ఏర్పాటు చేసే స్టడీ సర్కిల్స్‌లో విద్యార్థినీ, విద్యార్థులు విద్య, సామాజిక, చైతన్యమైన గొప్ప వ్యక్తులుగా ఎదగాలని అన్నారు. జెవివి జిల్లా ఎన్విరాన్మెంటల్ కన్వీనర్ మన్నం త్రిమూర్తులు మాట్లాడుతూ బాల, బాలికలు బాల్యం నుండే మంచి అలవాట్లు నేర్చుకోవాలని అన్నారు. ప్రశ్నించే తత్వం, ధైర్యం కలిగి పట్టుదలతో చదువుకొని ప్రతి ఒక్కరు లక్ష్యాన్ని చేరుకోవాలని అన్నారు. గంగినేని అనుదీప్ బాల, బాలికలకు బహుమతులు అందించారు. కార్యక్రమంలో అభ్యుదయ స్టడీ సర్కిల్ బాధ్యులు గాలి వెంకటేశ్వర్లు (ఎర్రయ్య), పిఎన్ఎం సభ్యులు బొమ్మతోటి రాజా రమేష్, అద్దంకి లేవీ ప్రసాద్, గంగినేని అలేఖ్య పాల్గొన్నారు.



మాట్లాడుతున్న జెవివి కార్యదర్శి తంగా శ్రీనివాసరావు

పారిశుధ్య కార్మికులకు దుస్తులు పంపిణీ

ప్రజాశక్తి - వేటపాలెం

స్వచ్ఛత కార్యక్రమాల్లో కీలక పాత్ర పోషిస్తున్న పారిశుధ్య కార్మికులకు నూతన వస్త్ర బహుకరణ, విందు ఆదివారం ఏర్పాటు చేశారు. బాబా ఫస్ట్ ఏయిడ్ పిల్లల హాస్పటల్ ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. డాక్టర్ కారంచేటి శివరామకృష్ణ ఆత్మీయంగా పలకరించారు. గ్రామంలో స్వచ్ఛత పట్ల మరింత ప్రోత్సాహాన్ని నింపేలా కష్టపడి పనిచేసే స్వచ్ఛ కార్మికుల కృషిని గుర్తిస్తూ నిర్వహించారు. న్యాయవాది బండారుపల్లి హేమంత్ కుమార్, పట్టభద్రుల సంఘం అధ్యక్షులు పత్తి వెంకట సుబ్బారావు, మాజీ ఉప సర్పంచ్ పోలకం చంద్రశేఖర్ మాట్లాడారు. గ్రామం స్వచ్ఛతలో ముందంజలో ఉండాలని అన్నారు. కష్టపడి చెత్త సేకరణ, రోడ్ల పరిశుభ్రతలో పనిచేసే స్వచ్ఛ కార్మికుల పట్ల ప్రజలు మరింత శ్రద్ధ చూపాలని, కార్మికుల కృషిని గుర్తించాలనేది కార్యక్రమం లక్ష్యం అన్నారు. బహుకరణ విందు కేవలం వస్త్రాలు ఇవ్వడం మాత్రమే కార్మికుల జీవితాల్లో ప్రోత్సాహాన్ని, గౌరవాన్ని పెంపొందించే గొప్ప అవకాశంగా నిలిచిందని అన్నారు.



కార్మికులకు వస్త్రాలు పంపిణీ చేస్తున్న దృశ్యం

శింగరకొండ దర్శించుకున్న హైకోర్టు జడ్జి

ప్రజాశక్తి - అద్దంకి

ఎపి హైకోర్టు న్యాయమూర్తి పివి జ్యోతిర్మయి కుటుంబ సమేతంగా లక్ష్మీ నరసింహస్వామి, ప్రసన్నాంజనేయ స్వామి దేవస్థానాల్లో స్వామివారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఆలయ ధర్మకర్తల మండలి, దేవస్థానం కార్య నిర్వాహణాధికారులు మదమంచి తిమ్మనాయుడు, మద్దినేని శ్రీనివాసరావు మర్యాద పూర్వకంగా ఆహ్వానించారు. ఆలయ అర్చకులు స్వాగతం పలికారు. అనంతరం స్వామి తీర్థప్రసాదాలు స్వీకరించారు. జడ్జిలు డి నాగ వెంకటలక్ష్మి, సీత, అడిషనల్ జూనియర్ సివిల్ జడ్జి అఖిల, బార్ అసోసియేషన్ అధ్యక్షుడు వై శ్రీనివాసరావు పాల్గొన్నారు.



స్వామివారిని దర్శించుకున్న హైకోర్టు జడ్జి జ్యోతిర్మయి



స్వర్ణ రమణయ్యను సన్మానిస్తున్న జెవివి నాయకులు

రమణయ్యకు జెవివి సన్మానం

ప్రజాశక్తి - పీసీపల్లి

మండలంలోని వెంగళాయపల్లి ప్రాథమిక పాఠశాల హెచ్ఎం స్వర్ణ రమణయ్యకు జిల్లా ఉత్తమ ఉపాధ్యాయ అవార్డు వచ్చిన సందర్భంగా అంతర్జాతీయ ఉపాధ్యాయ దినోత్సవం రోజైన ఆదివారం కనిగిరిలో జెవివి ఆధ్వర్యంలో సన్మానం చేశారు. పాఠశాల్లో విద్యార్థుల సంఖ్య పెంచినందుకు, విద్యార్థులకు నవోదయ, సైనిక స్కూల్ వంటి విద్యా సంస్థల్లో సీట్లు తెప్పించినందుకు సన్మానించారు. జ్ఞాపిక అందజేశారు. జెవివి రాష్ట్ర నాయకులు షేక్ గాయాజ్ భాష, జిల్లా అధ్యక్షులు జి శ్రీనివాసరెడ్డి, కెటిసి విద్యా సంస్థ అధినేత పాపారాయుడు, జెవివి నాయకులు పాల్గొన్నారు.

7న విజయవాడలో ఫ్యాప్టో ధర్నా

ప్రజాశక్తి - సిఎస్‌పురం రూరల్

ఉపాధ్యాయుల సమస్యలు పరిష్కరించాలని కోరుతూ ఈనెల 7న విజయవాడ ధర్నా చౌక్‌లో ఫ్యాప్టో ఆధ్వర్యంలో ధర్నా నిర్వహిస్తున్నట్లు యుటిఎఫ్ అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు ఎన్ వెంకటరమయ్య, షేక్ పాదుషా, జిల్లా కార్యదర్శి వి సాంభశివరావు తెలిపారు. మండలంలోని సీ నాగులవరం జడ్పి హెచ్ఎస్‌లో ఉపాధ్యాయులకు కరపత్రాలు పంపిణి చేశారు. సిపిఎస్‌ను రద్దు చేయాలని, కారుణ్య నియామకాలు చేపట్టాలని, ఉపాధ్యాయులను బోధనకి మాత్రమే పరిమితం చేయాలని, ఆసేస్మెంట్ బుక్స్ పున పరిశీలించాలని డిమాండ్ చేశారు. సమస్యలు పరిష్కరించాలని ఎపిటిఎఫ్ అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు తోట శ్రీనివాసులు, జెఎస్ ఆనంద్ బాబు, జిల్లా కార్యదర్శి షేక్ నాయబ్ రసూల్ కోరారు. నూతన ప్రభుత్వం ఏర్పడి 15 నెలల దాటినా ఉపాధ్యాయులకు రావలసిన సరెండర్ లీవ్, డిఎ బకాయిలేవి విడుదల కాలేదని అన్నారు.



పిల్లిపల్లెకు నూతనంగా నిర్మించిన మట్టిరోడ్డు

పిల్లిపల్లెకు రోడ్డు నిర్మాణం

ప్రజాశక్తి వార్తకు స్పందన

ప్రజాశక్తి - సిఎస్‌పురం రూరల్

మండలంలోని పిల్లిపల్లికి సర్పంచ్ బొట్ల చిరంజీవి రోడ్డు వేయించారు. బోయమడుగుల పంచాయతీ పిల్లిపల్లిలో ఉన్న సమస్యలు ప్రస్తావిస్తూ సమస్యలకు నిలయం పిల్లిపల్లి అంటూ ఇటీవల ప్రజాశక్తి ప్రచురించిన కథానికి సర్పంచ్ బోట్ల చిరంజీవి స్పందించారు. గ్రామంలోకి వెళ్లే రోడ్డుకు మట్టి తోలించి బాగు చేయించారు. వాటర్ పైపు లీకేజీలను సరి చేయించి నీరు సక్రమంగా వచ్చేలా చర్యలు చేపట్టారు. పంచాయతీలోని ఆరు గ్రామాల ప్రజలకు ఎటువంటి అసౌకర్యం కలగకుండా తమ పరిధిలో పరిష్కరించి ప్రజల సమస్యలు ఎప్పటికప్పుడు పరిష్కరిస్తున్నట్లు తెలిపారు.



విరాళం అందజేస్తున్న నాగరాజు దంపతులు

'పమిడి' దంపతుల విరాళం

ప్రజాశక్తి - వేటపాలెం

మండలంలోని రావూరిపేట శ్రీ కనక నాగవరపు అమ్మవారి దేవస్థానానికి సంతరావూరుకు చెందిన పమిడి నాగరాజు, విజయలక్ష్మీ దంపతులు రూ.32,500 విలువైన వెండి మీద గోల్డ్ కోటింగ్ చేసిన 198.500 గ్రాముల నాణేలు దేవస్థానకి సమర్పించారు. విరాళం అందజేసిన దంపతులను గ్రామస్థులు ప్రశంసించారు. దేవస్థాన ఇఒ పోతిని శ్రీనివాసరావు మాట్లాడారు.

మార్కాపురంలో మినీ మిర్చి యార్డు!

అసెంబ్లీలో ఎమ్మెల్యే 'కందుల' విజ్ఞప్తికి స్పందించిన కూటమి ప్రభుత్వం

ప్రజాశక్తి-మార్కాపురం

మార్కాపురంలో మిర్చి యార్డు ఆవశ్యకత ఏర్ప డింది. ఈ ప్రాంతంలో మిర్చి పంట ప్రధానంగా సాగుబడిలో ఉంది. ఏటా లక్ష ఎకరాలకు తగ్గకుండా మార్కాపురం డివిజన్ లో మిరప సాగవుతోంది. దిగుబడుల విక్రయ సమయంలో గుంటూరులోని మిర్చి యార్డుకు వెళ్లక తప్పడం లేదు.

మార్కాపురం ప్రాంతంలో రైతన్నలు మిర్చి సాగు పై మక్కువ చూపుతారు. ఈ ప్రాంతంలోని సాగు భూమి మిర్చి పంటకు అనుకూలంగా ఉంది. గుంటూరులోని మిర్చి యార్డుకు తరలిపోయే దిగుబడుల్లో అత్యధిక భాగం మార్కాపురం ప్రాంతం నుంచే కావడం విశేషం. అత్యధిక విస్తీర్ణంలో సాగుబడిలో ఉన్న మిర్చి దిగుబడుల అమ్మకాలు ఇక్కడే చేపట్టాలనే డిమాండ్ ఎప్పటి నుంచో ఉంది. అందుకు మార్కాపురం వ్యవసాయ మార్కెట్ యార్డు ఆవరణ అనుకూలంగా ఉంది. ఇక్కడ మినీ మిర్చి యార్డు ఏర్పాటు చేస్తే మాత్రం గిద్దలూరు, మార్కాపురం, యర్రగొండపాలెం, దర్శి, కనిగిరి నియోజకవర్గాల మిర్చి రైతులు మార్కాపురంలో విక్రయించేందుకు అనుకూలంగా ఉండనుంది. అందుబాటులో మిర్చి యార్డు లేని కారణంగా ఒక్కో రైతు రూ.10 వేల



అసెంబ్లీలో ఎమ్మెల్యే కందుల (ఫైల్)

నుంచి రూ.50 వేల వరకు రవాణా ఖర్చుల కోసం వెచ్చించాల్సి వస్తోంది. మిర్చి నిల్వలు ఉంచేందుకు ఈ ప్రాంతంలో తిప్పాయపాలెం సమీపంలో, కేశినేనిపల్లి సమీపంలో కోల్డ్ స్టోరేజీలు కూడా అందుబాటులో ఉన్నాయి. మార్కాపురం వ్యవసాయ మార్కెట్ యార్డు ఆవరణలోనూ ప్రభుత్వం నిర్మించే కోల్డ్ స్టోరేజీ నిర్మాణ దశలో నిలిచి పోయింది. కోల్డ్ స్టోరేజీ కోసం రూ.1.6 కోట్లు ఖర్చు చేశారు. మిగిలిన పనులను ప్రభుత్వం పూర్తి చేసి వినియోగంలోకి తీసుకువస్తే రైతులకు ప్రయోజనం కలుగుతుంది.

మార్కాపురం ప్రాంత మిర్చి రైతుల అవసరాలను ఎమ్మెల్యే కందుల నారాయణరెడ్డి గుర్తించారు. ఇటీవల జరిగిన అసెంబ్లీ సమావేశాల్లో మార్కాపురంలో మినీ మిర్చి యార్డు అవసరమని విజ్ఞప్తి చేశారు. ఇక్కడ పంట సాగు, రైతుల విక్రయ కష్టాలు, ఆర్థికంగా అధిక ఖర్చులు వంటివి ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లారు. ఈ విషయంపై కూటమి ప్రభుత్వం స్పందించింది. మినీ మిర్చి యార్డుకు అవసరమైన వసతులు గుర్తించేందుకు ప్రభుత్వం కమిటీని నియమించింది. ఈ కమిటీలో మార్కాపురం వ్యవసాయ మార్కెట్ యార్డు కార్యదర్శి కోటేశ్వరరావుతో పాటు మరో ముగ్గురు అధికారులను నియమించారు. ఈ కమిటీ రెండు లేదా మూడు రోజుల్లో మార్కాపురంలోని మార్కెట్ యార్డును పరిశీలించే అవకాశం ఉంది. ఎమ్మెల్యే కందుల నారాయణరెడ్డితో పాటు యార్డ్ చైర్మన్ మాలపాటి వెంకటరెడ్డితో కమిటీ సమావేశం కానుందనేది సమాచారం.

మున్సిపల్ కో-ఆప్షన్ సభ్యులు అమీరుల్లాఖాన్ మృతి

ప్రజాశక్తి-మార్కాపురం



పఠాన్ అమీరుల్లాఖాన్

మార్కాపురం మున్సిపల్ కో-ఆప్షన్ సభ్యులు పఠాన్ అమీరుల్లాఖాన్(70) ఆదివారం మృతి చెందారు. కొద్ది రోజులుగా అనారోగ్యంతో బాధపడుతున్నారు. ఆయనకు భార్య, పిల్లలు ఉన్నారు. మున్సిపల్ చైర్మన్‌గా అచ్యుత రామశేషయ్య ఉన్న కాలంలో పఠాన్ అమీరుల్లాఖాన్ అప్పటి 8వ వార్డు నుంచి స్వతంత్ర అభ్యర్థిగా పోటీచేసి కౌన్సిలర్‌గా గెలుపొందారు. గతంలో మార్కాపురం వ్యవసాయ మార్కెట్ కమిటీ డైరెక్టర్‌గా కొనసాగారు. ఆ తరువాత కాంగ్రెస్ పార్టీలో, తెలుగుదేశం పార్టీలో కొనసాగారు. ప్రస్తుతం వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీలో ఉన్నారు. ఆయన మృతికి మాజీ ఎమ్మెల్యేలు కెపి కొండారెడ్డి, జంకె వెంకట రెడ్డి, కుందురు నాగార్జునరెడ్డి, అన్నా వెంకటరాంబాబు, పలువురు ప్రముఖులు సంతాపం తెలిపారు.

7న ఎస్‌జీఎఫ్ అండర్-19 హాకీ జట్ల ఎంపికలు

ప్రజాశక్తి-సంతనూతలపాడు

స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ (ఎస్‌జీఎఫ్) ఆధ్వర్యంలో ఈ నెల 7న అండర్-19 ఉమ్మడి ప్రకాశం జిల్లా స్థాయి బాల బాలికల హాకీ జట్లను ఎంపిక చేయనున్నట్లు అండర్-19 జిల్లా కార్యదర్శి చింపారెడ్డి ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ ఎంపికలు మండలంలోని మైనంపాడు ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో నిర్వహించనున్నట్లు ఆయన తెలిపారు. ఎంపిక పోటీలలో పాల్గొనే క్రీడాకారులు తప్పనిసరిగా తమ ఆధార్ కార్డు, స్టడీ సర్టిఫికెట్ తీసుకొని 7వ తేదీ మంగళవారం ఉదయం 9 గంటలకు రిపోర్ట్ చేయాలని తెలిపారు. ఈ ఎంపికలకు 1-1-2007 తర్వాత జన్మించిన వారై ఉండాలని మరియు ఇంటర్మీడియట్ సెకండియర్ లోపు చదువుతున్న వారై ఉండాలని తెలిపారు. ఇతర వివరాలకు పాఠశాల పిఈటి తిరుమలశెట్టి రవికుమార్‌ను సెల్ 9951578357 ద్వారా సంప్రదించాలని తెలిపారు.

ఫ్యాప్టో ధర్నాకు పండిత పరిషత్ మద్దతు

ప్రజాశక్తి-మార్కాపురం

ఏకీకృత సర్వీస్ నిబంధనలు, బోధనేతర కార్యక్రమాలు, ఇతర విద్యారంగ సమస్యలతో పాటు ఆర్థికపరమైన ప్రయోజనాల సాధన కోసం ఫ్యాప్టో పక్షాన ఈ నెల 7వ తేదీన విజయవాడలోని ధర్నా చౌక్‌లో చేపట్టిన ధర్నాకు రాష్ట్రీయ ఉపాధ్యాయ పండిత పరిషత్ సంపూర్ణ మద్దతు ప్రకటించింది. ఈ మేరకు ఆ సంఘం రాష్ట్ర అధ్యక్షులు ఎన్ సంపత్‌కృష్ణ, రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఎం రవిచంద్రకుమార్ ఆదివారం ఓ ప్రకటన విడుదల చేశారు. ఈ ధర్నాలో రాష్ట్రీయ పండిత పరిషత్ కార్యవర్గ సభ్యులు, కార్యకర్తలు తప్పకుండా పాల్గొనాలని వారు విజ్ఞప్తి చేశారు.

ఎల్ఐసికి ఏజెంట్లే పట్టుకొమ్మలు

ప్రజాశక్తి-పొదిలి

భారతీయ జీవిత బీమాకు ఎల్ఐసి ఏజెంట్లు పట్టుకొమ్మలని మార్కాపురం సీనియర్ బ్రాంచ్ మేనేజర్ చెన్నయ్య అన్నారు. ఆదివారం స్థానిక ఎల్ఐసి శాటిలైట్ కార్యాలయంలో అభివృద్ధి అధికారి పి సుబ్రహ్మణ్యం ఆధ్వర్యంలో జరిగిన ఏజెంట్ల సమావేశంలో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొని మాట్లాడారు. కేంద్ర ప్రభుత్వం ఎల్ఐసి పాలసీల మీద ఉన్న జిఎస్టిని తొలగించడం పాలసీదారుల ప్రయోజనాలకు ఎంతో దోహదపడుతుందన్నారు. అదేవిధంగా ఎల్ఐసి ఏజెంట్లు కూడా అత్యధికంగా ఉన్న ప్రజలకి పాలసీలు అమ్మేందుకు విశేషంగా కృషి చేయాలన్నారు. ఏజెంట్లు తమ కమిషన్ పెంచుకొని ఆర్థికంగా నిలబడాలని సూచించారు. అభివృద్ధి అధికారి సుబ్రమణ్యం మాట్లాడుతూ నేటి సమాజంలోఎల్ఐసి ఏజెంట్‌గా గుర్తింపు రావడం ప్రజలకు సేవ చేయడం లాంటిదన్నారు.

తహశీల్దారుపై దాడికి యత్నించిన టిడిపి నేతపై కేసు నమోదు

ప్రజాశక్తి-మార్కాపురం

మార్కాపురం తహశీల్దారు కె చిరంజీవిపై దాడికి యత్నించిన టిడిపి నాయకుడు బి పోలిరెడ్డిపై పట్టణ పోలీస్ స్టేషన్‌లో కేసు నమోదైంది. తహశీల్దారు చిరంజీవి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు పట్టణ ఎస్ఐ ఎం సైదుబాబు తెలిపారు.

పేకాటరాయుళ్ల అరెస్ట్

ప్రజాశక్తి-మార్కాపురం

మార్కాపురం పట్టణ శివారుల్లోని తర్లుపాడు రోడ్డులో పేకాట ఆడుతున్న ముగ్గురు జూదరులను పట్టణ ఎస్ఐ ఎం సైదుబాబు ఆదివారం అరెస్ట్ చేశారు. జూదరుల నుంచి రూ.50,040 నగదును స్వాధీనం చేసుకున్నారు.

జగనన్న గెలుపునకు ప్రతి ఒక్కరూ కృషి చేయాలి

ప్రజాశక్తి-యర్రగొండపాలెం

యర్రగొండపాలెం ఎమ్మెల్యే తాటిపర్తి చంద్రశేఖర్ ఆదేశాలతో వైసీపీ రాష్ట్ర సోషల్ మీడియా సెక్రటరీ సయ్యద్ జబివుల్లా ఆధ్వర్యంలో నియోజకవర్గ వైసీపీ సోషల్ మీడియా టీమ్ సభ్యులకు పట్టణంలోని వైసీపీ కార్యాలయంలో ఆదివారం ప్రత్యేక సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా సయ్యద్ జబివుల్లా మాట్లాడుతూ నియోజకవర్గ పార్టీ సోషల్ మీడియా సభ్యులంతా సోషల్ మీడియాలో అధికార పార్టీ అవలంబిస్తున్న ప్రజా వ్యతిరేక విధానాలను ఎప్పటికప్పుడు ప్రజలకు తెలియజేయాలన్నారు. ఈ కార్యక్రమంలో నియోజకవర్గ వైసీపీ సోషల్ మీడియా టీమ్ సభ్యులు పాల్గొన్నారు.

కాపుల సంక్షేమానికి కూటమి ప్రభుత్వం కృషి

ప్రజాశక్తి-గిద్దలూరు

పట్టణంలోని పోరుమామిళ్ల రోడ్డులోని బలిజ సేవా సంఘం భవనంలో నూతనంగా ఏర్పాటు చేసిన శ్రీకృష్ణ దేవరాయల విగ్రహ ఆవిష్కరణ కార్యక్రమంలో ఎమ్మెల్యే ముత్తుముల అశోక్‌రెడ్డి ముఖ్య అతిథిగా పాల్గొని విగ్రహాన్ని ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ కాపుల సంక్షేమానికి కూటమి ప్రభుత్వం కృషి చేస్తుందని, గత టీడీపీ హయాంలో నియోజకవర్గంలో కాపు భవన్‌లు మంజూరు చేస్తే గత వైసీపీ పాలకులు నిర్వీర్యం చేశారని అన్నారు.

సిమెంట్ రోడ్లు, డ్రైన్స్ నిర్మాణానికి శంకుస్థాపన

ప్రజాశక్తి-గిద్దలూరు

పట్టణంలో రూ.51 లక్షల రూపాయలతో సిమెంట్ రోడ్లు, డ్రైనేజీల నిర్మాణానికి ఎమ్మెల్యే ముత్తుముల అశోక్‌రెడ్డి భూమి పూజ చేసి శిలాఫలకాలను ప్రారంభించారు. పట్టణంలోని ఎస్టీ కాలనీలో రూ.10.56 లక్షలతో నిర్మాణం చేపట్టనున్న డ్రైనేజీలకు భూమి పూజ చేసి శిలాఫలకాన్ని ప్రారంభించారు. 14వ వార్డు అర్బన్ కాలనీలో రూ.13 లక్షలతో నిర్మించనున్న సిమెంట్ రోడ్డు, 3వ వార్డు శ్రీరామ్ నగర్‌లో రూ.10 లక్షలతో నిర్మించనున్న సిమెంట్ రోడ్డుకు, కొంగళవీడు రోడ్డులో రూ.18 లక్షలతో నిర్మించనున్న సిమెంట్ రోడ్లకు భూమి పూజ చేసి శిలా ఫలకాలను ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన నాటి నుంచి అభివృద్ధి సంక్షేమమే లక్ష్యంగా పాలన సాగిస్తున్నామని, గ్రామాల్లో, పట్టణాల్లో సిమెంట్ రోడ్లు, డ్రైనేజీలు, మౌళిక వసతుల కల్పనే కూటమి ప్రభుత్వ లక్ష్యమన్నారు. ఈ కార్యక్రమంలో గిద్దలూరు మున్సిపల్ చైర్మన్ పాముల వెంకట సుబ్బయ్య, సొసైటీ బ్యాంక్



సిమెంట్ రోడ్డు ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే అశోక్ రెడ్డి

చైర్మన్ దుత్తా బాల ఈశ్వరయ్య, జిల్లా టీడీపీ నాయకులు కుప్పా రంగసాయి, మున్సిపల్ కమిషనర్ ఇవి రమణబాబు, టీడీపీ నాయకులు పాలుగుళ్ల చిన్న శ్రీనివాసరెడ్డి, బిల్లా రమేష్, బూనబోయిన చంద్రశేఖర్, బోయిలపల్లి కిషోర్, వేములపాటి చంటి, కావడి గురువయ్య, ఉలాపు బాలచెన్నయ్య, అబ్బు ఓబయ్య తదితరులు పాల్గొన్నారు.



జెండా విష్కరణలో మాట్లాడుతున్న రాజు

ఉద్యమాలకు సన్నద్ధం కావాలి

కెవిపిఎస్ జిల్లా అధ్యక్షుడు జవ్వాజి రాజు

ప్రజాశక్తి-మార్కాపురం

ఆత్మగౌరవం, సమానత్వం, కుల వివక్షపై ఉద్యమాలకు సన్నద్ధం కావాలని కెవిపిఎస్ జిల్లా అధ్యక్షుడు జవ్వాజి రాజు సూచించారు. ఆ సంఘం 28వ ఆవిర్భావ వేడుకల్లో భాగంగా మార్కాపురం పట్టణంలోని బాపూజీ కాలనీ, భగత్‌సింగ్ కాలనీ, యానాదుల కాలనీలలో కెవిపిఎస్ జెండాల ఆవిష్కరణలు ఆదివారం జరిగాయి. అనంతరం జవ్వాజి రాజు మాట్లాడుతూ స్వాతంత్ర్యం వచ్చి 78 ఏళ్ల గడిచినా దళితులు, గిరిజనులు, పేదలు, బడుగు బలహీన వర్గాలు నివసించే ప్రాంతాలో శ్మశానాలు లేవన్నారు. దళిత మహిళలు పని ప్రదేశాల్లో అనేక అవమానాలకు, అత్యాచారాలకు గురవుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. ఇటీవల కాలంలో అలాంటి అకృత్యాలు పెరుగుతున్నాయన్నారు. మహిళలకు అండగా కెవిపిఎస్ ఉంటుందన్నారు. ఈ కార్యక్రమంలో సిఐటియు జిల్లా కార్యదర్శి డికెఎం రఫి, కెవిపిఎస్ నాయకులు దీపాంకురాం, హరిబాబు, మేడిపల్లి గురవయ్య, జవ్వాజి కాశీరాజు, కరిముల్లా, జవ్వాజి సాల్మన్, మేడిపల్లి దాస్, హరిబాబు, బుజ్జి, సలీమా, జహరాబి తదితరులు పాల్గొన్నారు.

వన్య ప్రాణుల సంరక్షణ అవసరం

ప్రజాశక్తి-పెద్దారవీడు

వన్య ప్రాణుల సంరక్షణ అవసరమని మార్కాపురం అటవీ శాఖ డిప్యూటి రేంజి ఆఫీసర్ జి.నాగరాజు సూచించారు. మండలంలోని సుంకేసుల గ్రామంలో వన్య ప్రాణుల సంరక్షణ, అడవుల ఆవశ్యకతపై వన్యప్రాణి వారోత్సవాల్లో భాగంగా ఆదివారం అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా నాగరాజు మాట్లాడుతూ పర్యావరణ పరిరక్షణలో అడవులు, వన్య ప్రాణులు కీలకమన్నారు. అనంతరం కళాజాత బృందం ఆట పాటలతో ప్రజలను చైతన్య పరిచింది. వన్య ప్రాణులను కాపాడుతామని, అడవులను సంరక్షిస్తామని ఆ గ్రామ ప్రజలతో ప్రతిజ్ఞ చేయించారు. ఈ కార్యక్రమంలో ఆ గ్రామ సర్పంచి గుడ్డెపోగు రమేష్, ఫారెస్ట్ బీట్ ఆఫీసర్లు రవికుమార్, బాలకుమారి, ఏడుకొండలు, ధనలక్ష్మి, రామసుబ్బారావు, గురవయ్య, స్నేక్ క్యాచర్ నిరంజన్, ప్రజలు పాల్గొన్నారు.

ఈ-కేవైసి చేయించుకోవాలి

ప్రజాశక్తి-యర్రగొండపాలెం

మండలంలో మహాత్మగాంధీ జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకంలో పని గుర్తింపు జాబ్‌కార్డు కలి గిన ప్రతి ఒక్కరు ఈ-కేవైసి చేయించుకోవాలని ఏపీవోలు యం శైలజ, కె నాగేశ్వరరావులు తెలిపారు. ఆదివారం వారు మాట్లాడారు. ఉపాధి కూలీలకు ఈ-కేవైసి చేసే ప్రక్రియ వేగవంతంగా పూర్తి చేయాలని సూచించారు.



నివాళులు అర్పిస్తున్న డాక్టర్ లలిత సాగర్, పాపారావు

'శాగం'కు ఘన నివాళులు

ప్రజాశక్తి - తాళ్ళూరు

టిడిపి మండల మాజీ అధ్యక్షులు, ఒంగోలు పార్లమెంట్ కార్యనిర్వాహక కార్యదర్శి శాగం కొండారెడ్డి ఆదివారం అనారోగ్యంతో మృతి చెందారు. విషయం తెలుసుకున్న టిడిపి యువ నాయకులు డాక్టర్ కడియాల లలిత సాగర్, మాజీ ఎమ్మెల్యే పాపారావులు, మండలంలోని వెలుగువారి పాలెంలో స్వగ్రామానికి వెళ్లి కొండారెడ్డి మృతదేహానికి పూలమాల వేసి నివాళులర్పించారు. కొండారెడ్డి కుటుంబ సభ్యులను ఓదార్చి, తెలుగుదేశం ఎల్లప్పుడు అండగా ఉంటుందని భరోసా ఇచ్చారు. వారి వెంట టిడిపి నాయకులు, ఒంగోలు హర్షిని విద్యాసంస్థల అధినేత గోరంట్ల రవికుమార్, మున్సిల్ చైర్మన్ నారపుశెట్టి పిచ్చయ్య, ఎంపీపీ తాటికొండ శ్రీనివాసరావు, టిడిపి మండల అధ్యక్షులు మేడగం వెంకటేశ్వరరెడ్డి, నాటక కళాపరిషత్ డైరెక్టర్ బి ఓబుల్‌రెడ్డి, టిడిపి సీనియర్ నాయకులు సోమేపల్లి శ్రీను, ఎన్ శివకోటేశ్వరరావు, పిన్నిక రమేష్, తెలుగుదేశం ఒంగోలు పార్లమెంటు కార్యదర్శులు మానం రమేష్‌బాబు, తెలుగు యువత రాష్ట్ర కార్యదర్శి గొల్లపూడి వేణుబాబు, షేక్ బడే, కోటిరెడ్డి, సురారెడ్డి, క్లస్టర్ వెంకట్రావు, కొర్రపాటివారిపాలెం సర్పంచ్ కొర్రపాటి శ్రీదేవి, రామయ్య ఉన్నారు.



నియామక పత్రం అందుకుంటున్న వేము భగవాన్‌దాస్

విజిలెన్స్, మానిటరింగ్ కమిటీ సభ్యుల నియామకం

ప్రజాశక్తి - చీరాల

పౌర హక్కుల సంరక్షణ చట్టం (పిసిఎర్), ఎస్సీ, ఎస్టీ అత్యాచార నిరోధక చట్టం (పిఓఏ) ప్రకారం ఏర్పాటైన విజిలెన్స్, మోనిటరింగ్ కమిటీకి కొత్త సభ్యులను నియమించారు. కలెక్టర్ డాక్టర్ వి వినోద్ కుమార్ అధ్యక్షులుగా వ్యవహరించారు. మేలుకొలుపు వినియోగదారుల రక్షణ సంస్థ కార్యదర్శి దాసరి ఇమ్మానియేలు, దళిత బహుజన రిసోర్స్ సెంటర్ ఏరియా కో ఆర్డినేటర్ వేము భగవాన్ దాస్ కమిటీ సభ్యులుగా ఎంపికయ్యారు. వీరితో పాటు మరొక నలుగురు ఎస్సీ, ఎస్టీ వర్గాల వ్యక్తులు వ్యక్తిగత హోదాలో, బీసీ కమ్యూనిటీకి చెందిన దాసరి ఇమ్మానియేలు, రాజా సాల్మన్, లూథర్ శాస్త్రి స్వచ్ఛంద సంస్థల ప్రతినిధులుగా ఎంపికయ్యారు. 11 మంది సభ్యులతో కూడిన కమిటీలో ఎస్సీ, ఎస్టీ సామాజిక వర్గాల నుండి ఐదుగురు, వ్యక్తిగత హోదాలో, స్వచ్ఛంద సంస్థల నుండి ముగ్గురు, గ్రూప్ 1, గెజిటెడ్ హోదాలో ముగ్గురు అధికారులు సభ్యులుగా ఉన్నారు. చైర్మన్‌గా కలెక్టర్ డాక్టర్ వి వినోద్ కుమార్, కన్వీనర్‌గా సామాజిక సంక్షేమ జిల్లా అధికారి వ్యవహరిస్తారు. సభ్యులకు నియామక పత్రాలు జాయింట్ కలెక్టర్ జి గంగాధర్ గౌడ్ అందజేశారు. అనంతరం కమిటీ తొలి సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా సభ్యులు దాసరి ఇమ్మానియేలు, వేము భగవాన్ దాస్ మాట్లాడుతూ తమను కమిటీ సభ్యులుగా ఎంపిక చేసిన కలెక్టర్‌కు కృతజ్ఞతలు తెలిపారు. కమిటీ ప్రతి మూడు నెలలకు ఒకసారి కలెక్టర్, ఎస్పీ సమక్షంలో సమావేశమై దళిత, గిరిజనులపై జరిగే అత్యాచారాల నివారణ, పౌర హక్కుల పరిరక్షణ, అవగాహన కార్యక్రమాల సమీక్ష జరుపుతుందని తెలిపారు. కరోనా కాలంలో పేదలు, వలస కార్మికులకు సేవలు అందించామని తెలిపారు. ఇకపై కమిటీ సభ్యులుగా ప్రజల హక్కుల పరిరక్షణకు అంకితభావంతో పనిచేస్తామని పేర్కొన్నారు.

ప్రమాదకరంగా ఇరుకు వంతెన

ప్రజాశక్తి - బాపట్ల

పిట్టలవానిపాలెం ప్రభుత్వ జూనియర్ కళాశాల వద్ద ప్రధాన రహదారిపై మలుపులో ఇరుకు వంతెన ప్రమాద భరితంగా ఉంది. రహదారి భద్రతకు సవాలుగా మారింది. పడవల కాలువ ఎత్తు వంతెన నుండి ఖాజీపాలెం వైపు వచ్చే మార్గంలో జూనియర్ కళాశాల గేటు సమీపంలో తహశీల్దారు కార్యాలయానికి అత్యంత దగ్గరలో పంట కాలువపై మలుపు వద్ద ఇరుకు వంతెనపై ప్రయాణానికి వాహనదారులకు అగచాట్లు తప్పడం లేదు. తరచూ ప్రమాదాలు జరగడంతో పాటు వాహనాల రాకపోకలకు ఒక్కొక్కసారి తీవ్ర అంతరాయం కలుగు తోంది. భారీ వాహనాలుసైత మలుపు వద్ద తిరగలేక ఇరుక్కుపోయే పరిస్థితి ఎదురవుతోంది. బాపట్ల నుండి ఖాజీపాలెం, పిట్టలవానిపాలెం మీదుగా రేపల్లెకు ప్రయాణించే వాహనాలు ఈ మలుపు ఇరుకు వంతెన ద్వారా ప్రయాణించాల్సిందే. పిట్టలవానిపాలెం ఎంపిడిఒ, తహశీల్దారు ఇతర అధికారులు, కార్యాలయ సిబ్బంది ఈ మలుపు వంతెన ద్వారా రాకపోకలు కొనసాగించాల్సిందే. ఎన్నో ఏళ్లుగా ఈ సమస్య తలెత్తుతున్నప్పటికీ పంట కాలవపై ఉన్న ఈ వంతెన ఎత్తు



పిట్టలవానిపాలెం కాలేజీ వద్ద మలుపు ఇరుకు వంతెన

పెంచి మలుపు సరిచేసి నిర్మించాలని ప్రజలు కోరుతున్నారు. దశాబ్దాల క్రితం నిర్మించిన ఈ వంతెన ద్వారా అనేక మంది ప్రజాప్రతినిధులు, అధికారు లు, నాయకులు ప్రయాణిస్తుంటారు. ఒక్కొక్కసారి వారు ప్రయాణించే వాహనాల శ్రేణి ఈ మలుపు వద్ద ట్రాఫిక్‌లో చిక్కుకున్న పరిస్థితితులు లేకపోలేదు. అయినప్పటికీ ఈ వంతెన వద్ద పొంచి ఉన్న సమస్యతో పాటు ప్రమాదాలను గుర్తించడం లేదు. వంతెన పునర్ నిర్మించాలనే అంశాన్ని అధికారుల దృష్టికి తీసుకెళ్లడం లేదని ప్రజలు విమర్శిస్తున్నారు.

వంతెన సమీపంలో విద్యాసంస్థలు

ఇరుకు మలుపు వంతెనకు ఆనుకొని పిట్టలవాని పాలెం జూనియర్ కళాశాల, హైస్కూలు ఉన్నాయి. విద్యార్థులతో వంతెన వద్ద రద్దీ ఏర్పడి వచ్చే పోయే వాహనాలతో విద్యార్థులు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. వంతెనపై ఏ మాత్రం ఆద మరిచినా వాహనాలతో పాటు కాల్వలో జారి పడా ల్సిందే. కళ్ళముందే కనిపిస్తున్న సమస్యను స్థానిక నాయకులు గుర్తించడం లేదు. వాహన చోదకులు జాగ్రత్తలు తీసుకోవాలనే హెచ్చరిక బోర్డులు కూడా ఏర్పాటు చేయలేదు. దీంతో రాత్రి సమయాల్లో వాహన చోదకులు ప్రమాదాలకు గురవుతున్నారని స్థానికులు తెలిపారు.

ఎమ్మెల్యే నరేంద్ర వర్మ స్పందించాలి

పిట్టలవానిపాలెంకు చెందిన శాసన సభ్యులు వేగేశన నరేంద్ర వర్మ స్పందిస్తేనే ఈ ఇరుకు మలుపు వంతెనకు కొత్త రూపు సంతరించుకునే అవకాశాలు ఉన్నాయని స్థానికులు చెబుతున్నారు. పడవల కాల్వ వంతెన దిగువున పంట కాల్వపై ఇరుకు మలుపు వంతెన సమస్య నివారించేందుకు నూతన వంతెన నిర్మించేదిశగా కృషి చేయాలని ప్రజలు కోరుతున్నారు.

పర్యాటకం అభివృద్ధికి ప్రైవేటు భాగస్వామ్యం

ప్రజాశక్తి - బాపట్ల

శరవేగంగా అభివృద్ధి చెందుతున్న పర్యాటక రంగం మరింత అభివృద్ధి చెందే దిశగా ప్రభుత్వం తోపాటు ప్రైవేటు భాగస్వామ్యం అవసరమని పొన్నూరు మునిసిపల్ కమిషనర్ పుప్పాల రమేష్ బాబు అన్నారు. మండలంలోని పాండురంగపురం బీచ్ వద్ద ప్రైవేటు సంస్థలు పర్యాటక రంగం అభివృద్ధిలో భాగంగా ఏర్పాటు చేసిన అమరావతి వెంచర్, సాంచ్యురీ బై ద బీచ్, వెంచర్ బ్రోచర్‌ను ఆయన ఆదివారం ఆవిష్కరించారు. బీచ్ ఒడ్డున సువిశాలమైన విస్తీర్ణంలో గ్రేటర్ కమ్యూనిటీ విల్లాస్, ఓపెన్ ప్లాట్లను ప్రారంభించేందుకు చీరాలకు చెందిన అమరావతి వెంచర్ సౌజన్యంతో నూతన ఫ్లాట్లను ప్రారంభించారు. దీంతో 216 జాతీయ రహదారి, పాండురంగపురం బీచ్, ఐటిసి రెస్టారెంట్, అమరావతి రిసార్ట్స్, ఓడరేవు, రామాపురం బీచ్, బాపట్ల కారిడార్, యాగంటి రిసార్ట్స్, అమరావతి సన్ సిటీ,



బ్రోచర్‌ను ఆవిష్కరిస్తున్న నిర్వాహకులు

మచిలీపట్నం, ఒంగోలు, గుంటూరు, చీరాల, చెన్నై హైవే అనుసంధానమైన ఈ వెంచర్ బాపట్ల ప్రాంతానికి ఆరు కిలోమీటర్ల దూరంలో పర్యాటక రంగం అభివృద్ధికి ఎంతో తోడ్పాటు అందిస్తుందని అన్నారు. కార్యక్రమంలో జనసేన నాయకులు, వెంచర్లో భాగస్వామి విన్నకోట సురేష్, రియల్ ఎస్టేట్స్ అసోసియేషన్ అధ్యక్షులు బొట్టు కృష్ణ పాల్గొన్నారు.

హైవే రోడ్డు నిర్వహణలో అధికారుల నిర్లక్ష్యం

ప్రజాశక్తి - సిఎస్‌పురం రూరల్

మండలంలో నిర్మించిన హైవే రోడ్డు నిర్వహణలో కాంట్రాక్టర్ నిర్లక్ష్య వైఖరిపై ప్రజలు విమర్శిస్తున్నారు. రోడ్డు నిర్మాణం పూర్తయి ఏడాది గడవకముందే రోడ్డుపై డ్యామేజీ ఏర్పడింది. వాటిని మరమ్మత్తులకు గురవడం పట్ల ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. 167బి మైదుకూరు, సింగరాయకొండ జాతీయ రహదారి రోడ్డు నిర్మించారు. కోవిలంపాడు నుంచి పామూరు రోడ్డుకు ఇరువైపులా చిల్ల చెట్లు మొలచి రోడ్డును ఆక్రమించు కుంటున్నా పట్టించుకోలేదు. కోవిలంపాడు, కంభంపాడు గ్రామాల్లో ఫుట్ పాత్ ప్రక్కన చిల్లచెట్లు మొలిచి ఫుట్ పాత్ ఆక్రమించు కున్నాయి. పాదచారులు రోడ్డుపైనే నడిచి వెళుతుండటంతో ప్రమాదాలు జరిగే అవకాశం ఉందని ప్రజలు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. కోవిలంపాడులో తారు రోడ్డును



కోవిలంపాడులో తారురోడ్డు పక్కన ఏర్పడిన గుంత

ఆనుకుని రోడ్డుపై గుంత ఏర్పడటంతో వాహనదారులు ప్రమాదం బారిన పడకుండా గ్రామస్థులు ఆ గుంతలో సిమెంట్ రేకును ఉంచారు. కంభంపాడుకు సమీపంలోని బ్రిడ్జ్ ప్రాంతంలో రోడ్డు మార్జిన్‌లో తారు రోడ్డు కోసుకు పోయింది. అధికారులు స్పందించి రోడ్డు సక్రమంగా నిర్వహించేలా చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు.

దుమ్ము నుంచి ఇబ్బందులు తప్పించండి

ప్రజాశక్తి - సిఎస్‌పురం రూరల్

దుమ్ము, దూళి నివాస గృహాలను ముంచేస్తోంది. గ్రహాల ఆవరణలో కూర్చునే అవకాశం లేకుండా పోయింది. రోడ్డుపైకి రావాలంటే దుమ్ము కళ్ళల్లో పడుతుంది. దుమ్ము లేవకుండా చర్యలు చేపట్టి ఇబ్బందులు తీర్చుండి సారు అంటూ రహమత్ నగర్ పరిసర ప్రాంతాల్లోని గృహాల ప్రజలు కోరుతున్నారు. సిఎస్‌పురం నుంచి డిజిపేట వెళ్లే రహదారిలో బెల్లంకొండ కళాశాల వరకు రోడ్డు గుంటల మైయమై అద్వాన్నంగా ఉండడంతో టిడిపి అధ్యక్షుడు బొబ్బూరి రమేష్, సింగిల్ విండో అధ్యక్షుడు చెరుకుపల్లి వెంకటరెడ్డి ఆ గుంటలకు మట్టితోలి సరి చేయించారు. అయితే ప్రస్తుతం గ్రీన్ ఫీల్డ్ హైవే రోడ్డు నిర్మిస్తున్న మెగా కంపెనీకి చెందిన టిప్పర్లు ఈ రోడ్డుపై వెళుతుండటంతో దుమ్ము లేచి పరిసర ప్రాంత గృహాలలోని ప్రజలకు ఇబ్బందులు కలగజేస్తున్నది. మెగా కంపెనీ రోడ్డుపై నీళ్ల పోయకుండా టిప్పర్లను తిప్పడం పట్ల ప్రజలు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. ఈ విషయంపై ఆర్ అండ్ బి, నేషనల్ హైవే అధికారులకు తెలియజేసిన ఎవరు పట్టించుకోవడంలేదని ప్రజలు వాపోతున్నారు. రోడ్డుపై నీళ్ల పోస్తే దుమ్ము లేవకుండా ఉండే అవకాశం ఉందని అధికారులు స్పందించి ఆ విధంగా చర్యలు చేపట్టాలని, దుమ్ము, ధూళి నుంచి కలిగే ఇబ్బందులు తీర్చాలని ప్రజలు కోరుతున్నారు.



బాలికలను తల్లిదండ్రులకు అప్పగిస్తున్న దృశ్యం

తల్లిదండ్రుల చెంతకు బాలికలు

ప్రజాశక్తి - తాళ్ళూరు

మండలంలోని దారంవారిపాలెం వేస్ట్ పికర్స్ (ప్లాస్టిక్ వ్యర్థ సేకరణ) కుటుంబంనకు చెందిన నాగులూరి ఆదర్శ(11), నాగులూరి మేఘన(10) ఇద్దరు ఆడపిల్లలు గుడ్లూరు మండలం తెట్టు గ్రామంకు చెందిన బాతుల పెంపకం యజమాని వద్దకు 18 నెలల క్రితం వెళ్లడం జరిగినది. ఈ క్రమంలో తల్లిదండ్రులతో నెలకు రూ.5వేలు ఇస్తానని ఒప్పందం చేసుకొని తీసుకువెళ్లినాడు. బాకీ తీరినప్పటికీ 2 నెలలు అవుతున్న పిల్లలు పంపకుండ ఇంకా తనకు బాకీ ఉన్నదని, అవి చెల్లించి తీసుకెళ్లమని తెలుపుచున్నాడు. గత 17 రోజుల క్రితం తల్లికి ప్రమాదం జరిగి కాలు ఆపరేషన్ చేసుకున్నందున పంపించమని ప్రాధేయపడినప్పటికీ పంపలేదు. డిబిఆర్‌సి, ఇండియ లేబర్ లైన్ వారికి టోల్ ఫ్రీ నెంబర్‌కు ఫిర్యాదు చేయగా స్పందించి వెంటనే పిల్లలను 2రోజుల క్రితం కాకినాడలో ఉన్నారని తెలియక కాకినాడ సబ్ డివిజన్ మేజిస్ట్రేట్‌కి ఫిర్యాదు చేశారు. వారిని స్వయంగా డిబిఆర్‌సి, ఇండియన్ లేబర్ లైన్ ప్రతినిధులు పిల్లలను స్వాధీనం చేసుకొని తల్లిదండ్రులకు అప్పగించారు. ఈ క్రమంలో ప్రకాశం జిల్లాలోని పిల్లలతో పని చేసే సంబంధిత అధికారులకు ఫిర్యాదు చేసినప్పటికీ ఎవరు స్పందించలేదు. ఈ పిల్లలను రేపు కలెక్టర్‌కు గ్రీవెన్స్‌లో హాజరు పరిచి రిలీజ్ ఆర్డర్ కొరకు ప్రయత్నిస్తున్నామని తెలిపారు. సదరు బాలికలను విద్యకు దూరమైనందున వారిని పాఠశాలలో ప్రవేశం కల్పించుటకు కృషి చేస్తున్నామని తెలిపారు.

ఉరేసుకుని వృద్ధుడు ఆత్మహత్య

ప్రజాశక్తి - చీరాల

పట్టణంలోని బెస్తపాలెంలో నివసించే తొత్తర అప్పారావు (67) అనే వృద్ధుడు గత కొంతకాలంగా ఆరోగ్య సమస్యలతో బాధపడుతున్నట్లు కుటుంబ సభ్యులు తెలిపారు. ఇటీవల ఆయనను వైద్యం కోసం హైదరాబాద్‌కు తీసుకెళ్లగా చికిత్స అనంతరం చీరాలకు తిరిగి వచ్చారని పేర్కొన్నారు. ఆరోగ్యం క్షీణించడంతో మానసికంగా ఒత్తిడికి లోనైన ఆయన శనివారం రాత్రి కుటుంబ సభ్యులు బయటకు వెళ్లిన సమయంలో ఇంట్లో ఉరి వేసుకుని ఆత్మహత్యకు పాల్పడ్డాడని తెలిపారు. సమాచారం అందుకున్న పోలీసులు సంఘటనా స్థలానికి చేరుకుని పరిశీలించారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. ఆయన పెద్ద కుమార్తె శనగల సత్యవతి అదే ప్రాంతంలో ఆదిత్య లాడ్జ్ సమీపంలో నివసిస్తుండగా, రెండవ కుమార్తె వెలగం పద్మ హైదరాబాద్‌లోని ఓ సాఫ్ట్‌వేర్ సంస్థలో ఉద్యోగం చేస్తున్నారు. కుమారుడు తొత్తర రాంబాబు బెంగళూరులో ప్రైవేట్ సంస్థలో పనిచేస్తున్నారు.

కలుపుతో బీడుగా మారిన మినుము

ప్రజాశక్తి - ఇంకొల్లు

ఇంకొల్లు, పంగులూరు, మార్టూరు తదితర ప్రాంతాల్లో ఖరీఫ్ పంటగ అక్కడక్కడ సాగుచేసిన మినుము పైరుకు తలనత్త తెగులు సోకింది. ఈ ఏడాది కరీఫ్ పంటలు అతి తక్కువగా సాగు చేశారు. ఏ పంట వేసిన నష్టపోతున్నామనే ఆలోచనతో కరీఫ్ సాగుకు రైతులు ముందుకు రాలేదు. అయితే జిల్లాలో పర్చూరు డివిజన్లో ఇంకొల్లు మండలం పావులూరు, సూదివారిపాలెం, నక్కలపాలెం, నాగండ్ల, ఇడుపులపాడు గ్రామాల్లో రైతులు కొంతమంది మొక్కజొన్న, మినుము ఖరీఫ్ పంటలుగా వేశారు. పంగులూరు మండలంలోని బోదవాడ, కలవారిపాలెం, మల్లవరం, పంగులూరు, ఆరికట్లవారి పాలెం, మార్టూరు మండలం ద్రోణాదుల, బొబ్బేపల్లి, కోళ్లపూడి తదితర గ్రామాల్లో మినుము సాగు చేశారు. మినుము విత్తనాలు వ్యవసాయ శాఖ రైతులకు రాయితీపై ఇచ్చారు. రాయితీ విత్తనాలతో పాటు కొంతమంది ప్రైవేటు దుకాణాల్లో విత్తనాలు కొనుగోలు చేసి ఆగస్టు నెల ఆఖరు, సెప్టెంబర్ మొదటి వారంలో మినుము సాగు చేశారు.



కలుపుతో బీడుగా మారిన మినుము పైరు

పంట వేసి 45 రోజులు దాటుటంతో మినుము పైరు పూత, పిందె, కాయ దశకు చేరింది. పూత దశ నుంచి తల నత్త తెగులు ప్రారంభమైంది. దీంతో మొక్కలు పైభాగం పసుపు రంగుగా మారి ముడత వచ్చి వడలిపోతున్నాయి. ఈ తెగులు ప్రభావంతో పూత, పిందె, కాయ లేకుండా వట్టి చెట్లు మాత్రమే కనిపిస్తున్నాయి. దీంతో మినుము సాగు చేసిన రైతుల్లో ఆందోళన ప్రారంభమైంది. తెగుళ్లకు సంబంధించి మందులు పిచికారి చేసిన నివారణ కాటంలేదని రైతులు వాపోతున్నారు. ఇటీవల కురిసిన వర్షాలకు ఇంకా తెగులు ప్రభావం ఎక్కువ అవుతుందని తెలిపారు. కొంచెం ఆలస్యంగా సాగు చేసిన రైతుల పరిస్థితి మరోలా ఉంది. విత్తనం పెట్టిన మొక్క మొలిచిన నాటి నుంచి వర్షాలు పడటంతో పైరు ఎర్రగా మారి గిడస బారిపోతుంది. మినుము పంట ఎదబెట్టి 25 రోజులు కావస్తుంది. సెప్టెంబర్ 2వ వారంలో విత్తనా ఎద వేశారు. వర్షాలకు పైరు ఎరుపుగా మారటం తో పాటు విపరీతంగా మొక్కల తోపాటు కలుపుతుంది. కలుపుతో బీళ్లుగా గామారుతున్నాయి. ఏదేమైనా పప్పు పంటగా అక్కడక్కడ సాగుచేసిన మినుము రైతుకు ఎదురు దెబ్బ తగులుతుంది. విత్తనాలు, వ్యవసాయం, తెగుళ్ల మందులు, ఎరువులు, కలుపు అన్నీ కలిపి ఇప్పటికి ఎకరాకు రూ.15వేల వరకు పెట్టుబడి పెట్టారు. రైతులు మినుము పంట చేతికి ఎకరకు క్వింటా కూడా వచ్చే పరిస్థితి లేదని ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ఆలస్యంగా సాగుచేసిన మినుము బీళ్లుగా ఎర్రగా మారిందని, పైరు చెడగొట్టేందుకు సిద్ధమవుతున్నారు.



చెన్నైలో కటికలను సత్కరిస్తున్న కనిగిరి ప్రాంత ప్రజలు

వైసిపి ఎస్సీ సెల్ కార్యదర్శి 'కటికల'కు సన్మానం

ప్రజాశక్తి - కనిగిరి

వైసిపి ఎపి ఎస్సీ సెల్ రాష్ట్ర కార్యదర్శిగా పదవి పొంది చెన్నై నగరానికి విచ్చేసిన కటికల వెంకటరత్నంకు కనిగిరి ప్రాంత ప్రజలు ఘన స్వాగతం పలికారు. ఈ సందర్భంగా ఆయనను ఘనంగా సన్మానించారు. కనిగిరి నియోజకవర్గా నికి చెందిన ఆయనకు వైసిపి సముచిత స్థానం కల్పిం చిందని అన్నారు. రాష్ట్రస్థాయి పదవి ఆయనకు రావడంలో కృషి చేసిన వైసీపీ ఇన్చార్జి దద్దాల నారాయణ యాదవ్‌కు ధన్యవాదాలు తెలియజేస్తున్నట్లు తెలిపారు. కటికల వెంకటరత్నం మాట్లాడుతూ బడుగు, బలహీన వర్గాలకు పెద్దపీట వేయటంలో వైసీపీ ఎప్పుడు ముందుంటుందని అన్నారు. రానున్న రోజుల్లో కలిసికట్టుగా దద్దాల నారాయణ యాదవ్‌ను ఎమ్మెల్యేగా గెలిపించుకుంటామని అన్నారు. తనకు చెన్నై పట్టణంలో ఇంతటి ప్రేమానురాగాలు చూపించిన ప్రతి ఒక్కరికి ధన్యవాదాలు తెలిపారు. టి ఇశ్రాయేల్, ఎం జోసెఫ్, ఎం లాబన్, పి కొండయ్య, జి గాబ్రెల్, కె బెన్నయ, జీవ రత్నం, కె దాసు, ధవేధుడు, కె రవి, జి రాజా షేకర్, టి జార్జ్, జె ప్రసాద్, జె చిన్నా జపాన్నియా, జె ఆనంద్, డేవిడ్, జార్జ్, యేసు రత్నం, టి ఆంథోనీ, జె గెరోజ్, అమోస్, సిహెచ్ కుమార్ పాల్గొన్నారు.

సెల్‌ఫోన్ మాట్లాడుతూ డ్రైవర్ నిర్లక్ష్యం

ప్రజాశక్తి - చీరాల

చీరాల, ఒంగోలు బైపాస్ రైడర్ బస్సు డ్రైవర్ సెల్‌ఫోన్ మాట్లాడుకుంటూ నిర్లక్ష్యంగా బస్సు నడుపుతూ ప్రయాణికు లను భయభ్రాంతులకు గురిచేశాడు. ఆదివారం రాత్రి ఒంగోలు నుండి చీరాలకు వచ్చిన బైపాస్ రైడర్ ఏపీ 234802 నంబరు గల బైపాస్ రైడర్ బస్సులో సూరంపల్లి తేజస్విని అనే మహిళా ప్రయాణికురాలు తెలిపిన వివరాల ప్రకారం బస్సు బయలుదేరిన క్షణం నుండి డ్రైవర్ నిర్లక్ష్యంగా నడుపుతున్నాడని తెలిపారు. సెల్‌ఫోన్‌లో మాట్లాడుతూనే డ్రైవింగ్ చేయడంతో మార్గం మధ్యలో నాగులుప్పాడు సమీపంలో డివైడర్‌ను ఢీ కొట్టాడని, చిన్నగంజాం టోల్‌గేట్ వద్ద కూడా గేటును రాసుకుంటూ రాష్ డ్రైవింగ్ చేయడంతో ప్రయాణికులు భయభ్రాంతులకు గురైనట్లు తెలిపారు. ఈ ఘటనతో ఆగ్రహించిన తేజస్విని చీరాల చేరుకున్న వెంటనే ఆర్టీసీ డిపో విచారణ కేంద్రంలో ఫిర్యాదు చేసేందుకు వెళ్లారు. అక్కడ సిబ్బంది స్పందించక పోవడంతో ఆమె మరింత అసహనం వ్యక్తం చేశారు. ఈ విషయం తెలుసుకున్న ప్రజాశక్తి ఆర్టీసీ డిపో మేనేజర్ శ్యామలను వివరణ కోరగా డ్రైవర్‌పై విచారణ జరిపి చర్యలు తీసుకుంటామని తెలిపారు.

అనారోగ్య యువకుడికి ఆర్థిక సహాయం

ప్రజాశక్తి - కనిగిరి

విధి వక్రీకరించింది. ఫలితంగా కుటుంబ యజమాని అనారోగ్యం పాలై కుటుంబ పోషణ కష్టతరంగా మారింది. దీంతో ఆ బాధ్యత తీసుకోవాల్సి వచ్చింది. భర్తకు సేవలు చేయాల్సిరాగా కుటుంబ పోషణ కష్టతరంగా మారింది. దీంతో సొంత ఊరు వదిలి ఊరూరు తిరుగుతూ స్థిర నివాసం లేకుండా సంచారం చేస్తూ తన భర్తను కంటికి రెప్పలా కాపాడుకుంటూ తన ఇద్దరు బిడ్డలను పోషించుకోవడానికి కదిరికి చెందిన ఒక కుటుంబం యాతన పడుతుంది. మండలంలోని పునుగోడులోని ప్రముఖ పుణ్యక్షేత్రమైన శ్రీ సిద్దేశ్వర స్వామి ఆలయంలో అర్చకునిగా పని చేస్తున్న నుదురుపాటి సుబ్బయ్య ఒక వివాహానికి పొదిలి వెళ్లి వస్తుండగా పొదిలి గ్రామ శివారులో పక్షవాతంతో బాధపడుతున్న యువకుడికి సేవలు చేస్తూ ఇద్దరు కుమారులను పోషించుకుంటూ మహిళ పడుతున్న అవస్థలు గమనించారు. వివరం అడగక పక్షవాతం రాకముందు తమను తన భర్త పోషించాడని, ఇప్పుడు అనారోగ్యం పాలై ఇబ్బంది పడుతుంటే ఆ బాధ్యత తాను తీసుకున్నట్లు తెలిపారు. పైగా భార్యగా తన బాధ్యతని చెప్పడంతో ఆమె చేస్తున్న సేవలను చూసి చలించిన



ఆర్థిక సహకారం అందిస్తున్న పూజారి ఎన్ సుబ్బయ్య

అర్చకుడు సుబ్బయ్య తన వంతుగా ఆ కుటుంబ పోషణకు రూ.4వేల ఆర్థిక సహాయం అందించారు. ప్రయాణంలో తాను కాలకృత్యాలు తీర్చుకునేందుకు రోడ్డు పక్కకు వెళ్లగా బాధపడుతున్న కుటుంబం అవస్థ తన కంటపడిందని, ఉడత భక్తిగా సాయం చేయాలని అనిపించిందని తెలిపారు. భర్త అనారోగ్య పాలైతే వదిలివేయకుండా కంటికి రెప్పలా కాపాడుతూ తన ధర్మాన్ని ఆ యువతి నిర్వహించడం దేశంలో సాంప్రదాయం కొనసాగుతుందనేందుకు నిదర్శనం అన్నారు. మానవసేవే మాధవసేవని, ఆపదలో ఉన్న వారికి మనకు చేతనైనంత సహాయం చేయడం అవసరమని అన్నారు.

జీఎస్టీ తగ్గినా తగ్గని నిత్యావసరాల ధరలు

ప్రజాశక్తి - రేపల్లె

దేశవ్యాప్తంగా వస్తు సేవల పన్ను (జీఎస్టీ) తగ్గింపు అమలులోకి వచ్చింది. దీంతో పలు రకాల వస్తువులు ధరలు తగ్గుతాయని ఎదురుచూస్తున్నారు. ధరలు తగ్గుతాయని కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ప్రకటించడంతో దుకాణాలకు వచ్చే వినియోగదారుల సంఖ్య పెరిగింది. అయితే నిత్యావసర ధరల వస్తువులు ఇప్పట్లో తగ్గే అవకాశం లేదని, తగ్గడానికి 15 నుండి నెల రోజుల సమయం పడుతుందని చెపుతున్నారు. ప్రస్తుతం పాత స్టాక్ ఉందని, ఈ స్టాక్ అయిపోయి కొత్త స్టాకు వస్తేనే కొత్త ధరలు ఇవ్వగలమని, పాత స్టాక్ ఉన్న కారణంగా పాత ధరల ప్రకారమే నిత్యావసర వస్తువులు విక్రయిం చాల్సి వస్తుందని దుకాణం దారులు చెబుతున్నారు. ఆరోగ్య బీమా ప్రీమియంపై జీఎస్టీ తొలగించారని పాలసీదారులకు భీమా కంపెనీ సందేశాలు పంపుతు న్నాయి. నిత్యవసర వస్తువులపై జీఎస్టీ 12 నుంచి 5శాతానికి తగ్గించింది. నెయ్యి, వెన్న, పనీర్ వంటి ఉత్పత్తులపై తగ్గిన జీఎస్టీ రేట్లు తాజాగా విజయ డెయిరీ విడుదల చేసింది. పన్నీరుపై గతంలో జీఎస్టీ 5 శాతం ఉండగా సోమవారం నుండి దాన్ని పూర్తిగా తొలగించారు. పన్నీరు కిలో రూ.480 నుండి రూ.465 కు తగ్గినట్లు తెలిపారు. సూపర్ మార్కెట్లలో కొత్త రేట్లు అమలులో ఉన్నా చిన్న రిటైల్ దుకాణాల్లో పాత ధరలే కొనసాగుతున్నాయి. మందుల ధరల్లో పెద్దగా మార్పు లేదు. వీటిలో తగ్గింపు కనిపించలేదు. దుకాణాల్లో, ఈ-కామర్స్ సైట్లలో తగ్గిన జీఎస్టీ ప్రయోజనం వినియోగ దారులకు అందడం లేదని ఫిర్యాదులు చేస్తున్నారు.

పెరిగిన కొబ్బరి ఉత్పత్తి ధరలు

పీసీపల్లి : జీఎస్టీ రద్దు చేశామని, భారీగా తగ్గించామని, కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు సంబరాలు జరుపుకుంటు న్నాయి. ఇదే సమయంలో కొబ్బరి ఉత్పత్తుల ధరలు విపరీతంగా పెరిగాయి. గతంలో కంటే కేంద్ర ప్రభు త్వం జీఎస్టీని కొన్ని వస్తువులకు తగ్గించామని, కొన్నిం టికి రద్దు చేశామని సెప్టెంబర్ 22 ప్రకటించింది. తర్వా త వీటి ధరలు భారీగా పెరిగాయి. వినియోగదా రులు ఇబ్బందులు పడుతున్నారు. గ్రామాల్లో పాడిపరి శ్రమపై ఆధారపడే వారికి పశువుల దాణా కోసం కొబ్బరి పిట్టు వినియోగిస్తుంటారు. కొబ్బరి పిట్టు గతంలో 25 కేజీలు బస్తా రూ.1100 ఉండేది. ప్రస్తుతం రూ.1400కు పెరి గింది. గతంలో 100 గ్రాములు కొబ్బరినూనె రూ.53 ఉండగా ప్రస్తుతం రూ.65కు పెరిగింది. గతంలో కొబ్బరినూనె అర లీటరు రూ.180 ఉండగా ప్రస్తుతం రూ.300 పెరిగింది. గతంలో రూ.35 ఉన్న కొబ్బరికా య ప్రస్తుతం రూ.45కు పెరిగింది. సామాన్య మానవు డికి అవసరమైన నిత్యావసర వస్తువులు ఉప్పు, పప్పు, బియ్యం, ఆహార ధాన్యాలు కూరగాయల్లో ఎలాంటి మార్పు లేదు. సబ్బులు, పేస్టులో మాత్రమే కొంత ధర తగ్గింది. సెప్టెంబర్ 22 తర్వాత వినియో గదారులు ఇబ్బందులు పడుతున్నారు. ప్రభుత్వం పేపరు ప్రకటన ద్వారా జీఎస్టీ తగ్గింపుతో ప్రజలకు నెలకు రూ.15 వేలు ఆదాయమని ప్రచారం చేశారు. వినియోగదారులు దుకాణం వద్దకు వచ్చి జీఎస్టీ రద్దు చేశారు, లేదా తగ్గించారని ధరలు తగ్గలేదని ప్రతి ఒక్కరు ప్రశ్నిస్తున్నారు.



మాట్లాడుతున్న ఎస్ఐ శేషసాయి, మధుబాబు

వాహనదారులకు అవగాహన

ప్రజాశక్తి - కారంచేడు

వాహదారులకు పోలీసులు అవగాహన నిర్వహించారు. రహదారులపై ద్విచక్ర వాహనదారులు అడ్డదిడ్డంగా నిలిపి ఇతర ప్రయాణికులకు ఇబ్బంది కలిగిస్తే ఉపేక్షించేది లేదని ఎస్ఐలు శేషసాయి, మధుబాబు హెచ్చరించారు. గ్రామంలోని పలు ప్రాంతాల్లో వాహనదారులకు సరైన పార్కింగ్ ప్రదేశాలపై అవగాహన కల్పించారు. వాడరేవు నుండి పిడుగురాళ్ల వరకు జాతీయ రహదారి విస్తరణ, అభివృద్ధి పనులు జరుగుతున్న సమయంలో రాకపోకలు పెరిగాయని, కారంచేడు మార్గం ద్వారా దూరప్రాంతాలకు వెళ్లే ప్రయాణికులు సౌకర్యంగా వెళ్లేందుకు చర్యలు తీసుకుంటున్నామని అన్నారు. అడ్డదిడ్డంగా వాహనాలు నిలిపే వ్యక్తులపై కఠిన చర్యలు తీసుకుంటామని తెలిపారు. వ్యాపార సముదాయాలకు చెందిన వ్యాపారులు కొనుగోలు కోసం వచ్చే వినియోగదారుల వాహనాలు క్రమపద్ధతిలో నిలపడానికి అవసరమైన సదుపాయాలు కల్పించాలని కోరారు. ప్రజలు నిబంధనలు పాటించి రహదారులపై క్రమబద్ధంగా పార్కింగ్ చేయాలన్నారు.



పేకాట రాయిళ్లను అదుపులోకి తీసుకున్న ఎస్సై శ్రీరామ్

పేకాట రాయుళ్లు అరెస్ట్

ప్రజాశక్తి - కనిగిరి

స్థానిక డిఎస్‌పి పి సాయి ఈశ్వర్ యశ్వంత్, సిఐ ఎస్‌కె ఖాజావలి ఆదేశాల మేరకు ఎస్ఐ టి శ్రీరామ్ మండలంలోని ఎడవల్లి చర్చి వద్ద పేకాట ఆడుతున్న 14 మంది పేకాట రాయుళ్లను తన సిబ్బందితో కలిసి అదుపులోకి తీసుకున్నట్లు తెలిపారు. వారి వద్ద నుంచి రూ.11470 నగదు స్వాధీనం చేసుకున్నట్లు తెలిపారు. కేసు నమోదు చేసి కోర్టులో హాజరు పర్చనున్నట్లు తెలిపారు.



హెల్మెట్‌పై అవగాహన కల్పిస్తున్న ఎస్ఐ శివయ్య

హెల్మెట్ తప్పనిసరిగా ధరించాలి

ప్రజాశక్తి - బాపట్ల

ద్విచక్ర వాహనదారులు ప్రతి ఒక్కరు తప్పనిసరిగా హెల్మెట్ ధరించి వాహనాన్ని నడపాలని చందోలు ఎస్ఐ మర్రి శివకుమార్ సూచించారు. ఎస్పీ బి ఉమామహేశ్వర్ ఆదేశాల మేరకు డిఎస్‌పి రామాంజనేయులు సూచనల మేరకు చందోలు, రెడ్డిపాలెం టోల్ ప్లాజా వద్ద ఆయన వాహన తనిఖీలు నిర్వహించారు. రెడ్డిపాలెం టోల్ ప్లాజా వద్ద ద్విచక్ర వాహనదారులకు హెల్మెట్ ధరించడం వల్ల కలిగే ప్రయోజనాలు వివరించారు. ఎస్పీ ఆదేశాల మేరకు వాహదారులకు అవగాహన కల్పించామని తెలిపారు. ద్విచక్ర వాహనాలను తప్పనిసరిగా హెల్మెట్ ధరించి, వాహనానికి సంబంధించిన వాహన పత్రాలు వాహనంలో ఉండాలని సూచించారు. మద్యం సేవించి వాహనం నడిపితే చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. మైనర్లకు వాహనాలు ఇవ్వడం ద్వారా ప్రమాదాలు జరిగే అవకాశం ఎక్కువగా ఉంటుందని అన్నారు. కాబట్టి తల్లిదండ్రులు ఎవరు మైనర్లకు వాహనాలు ఇవ్వద్దన్నారు. హెల్మెట్ లేకుండా వాహనం నడిపే వారికి చలానా విధించారు.

నేడు ప్రజా సమస్యల పరిష్కార వేదిక

జిల్లా కలెక్టర్ డాక్టర్ వి.వినోద్‌కుమార్

ప్రజాశక్తి-బాపట్ల జిల్లా



కలెక్టర్ వినోద్ కుమార్

ప్రభుత్వ ఆదేశాల మేరకు ప్రతి సోమవారం జిల్లా కలెక్టరేట్‌లో నిర్వహించే ప్రజా సమస్యల పరిష్కార వేదిక (పిజిఆర్ఎస్)లో ప్రజలు అందజేసిన సమస్యల అర్జీలపై ఉదయం 9 గంటల నుంచి 10 గంటల వరకు అన్ని శాఖల జిల్లా అధికారులతో జిల్లా కలెక్టర్ డాక్టర్ వి.వినోద్ కుమార్ సమీక్ష నిర్వహించడం జరుగుతుందని, అనంతరం ఉదయం 10 గంటల నుంచి మధ్యాహ్నం 1 గంట వరకు ప్రజల నుంచి సమస్యల అర్జీలను స్వీకరించడం జరుగుతుందని జిల్లా కలెక్టర్ డాక్టర్ వి.వినోద్ కుమార్ ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. అర్జీదారులు అందజేసిన అర్జీలు ఇప్పటికీ పరిష్కారం కాకపోయినా లేదా తమ ఫిర్యాదులకు సంబంధించిన సమాచారం తెలుసుకోవడానికి 1100 నంబర్‌కు కాల్ చేయవచ్చునని జిల్లా కలెక్టర్ తెలిపారు. ప్రజలు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకొని తమ సమస్యలకు పరిష్కారం పొందాలని కలెక్టర్ తెలిపారు.

7న 'చలో విజయవాడ'కు ఫ్యాప్టో పిలుపు

ప్రజాశక్తి-ఒంగోలు సిటీ



కరపత్రం ఆవిష్కరిస్తున్న నాయకులు

ఉపాధ్యాయ హక్కుల సాధనకు ఫ్యాప్టో రాష్ట్రవ్యాప్తంగా చేపట్టిన ఉద్యమంలో భాగంగా అక్టోబర్ 7న విజయవాడ ధర్నా చౌక్‌లో జరగనున్న కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని ఫ్యాప్టో ఒంగోలు డివిజన్ కోరింది. ఈ మేరకు ఆదివారం ఒంగోలు యుటిఎఫ్ జిల్లా కార్యాలయంలో డివిజన్ సన్నాహక సమావేశం జరిగింది. ఫ్యాప్టో డివిజన్ అధ్యక్షులు షేక్ అబ్దుల్ హై అధ్యక్షతన జరిగిన సమావేశంలో నేతలు మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం వెంటనే ఉపాధ్యాయ సంఘాలతో సమావేశం ఏర్పాటు చేసి, బోధనేతర పనులు మరియు ఆర్థిక సమస్యల పరిష్కారానికి స్పష్టమైన రూట్ మ్యాప్ ప్రకటించాలని డిమాండ్ చేశారు. ఈ సమావేశంలో ఎస్టీయూ రాష్ట్ర బాధ్యులు చల్లా శ్రీను, ఏపిటిఎఫ్ 257 జిల్లా ప్రధాన కార్యదర్శి డి.శ్రీనివాసులు, హెచ్ఎం అసోసియేషన్ జిల్లా అధ్యక్షులు వై.వెంకట్రావు, యుటిఎఫ్ జిల్లా ట్రెజరర్ ఎన్. చిన్నస్వామి, గౌరవాధ్యక్షులు ఎస్.రవి, సిహెచ్. ప్రభాకర్ రెడ్డి, ఏపీపీఎఫ్ రాష్ట్ర నాయకులు పి.బి. సుబ్బారావు, జన విజ్ఞాన వేదిక జిల్లా అధ్యక్షులు యు.వెంకట్రావు, రాష్ట్ర నాయకులు భాస్కర్ తదితరులు పాల్గొన్నారు.

8న మార్కెట్ కమిటీ ప్రమాణ స్వీకారం

ప్రజాశక్తి-ఒంగోలు సిటీ

ఒంగోలు వ్యవసాయ మార్కెటింగ్ నూతన కమిటీ అక్టోబర్ 8న బుధవారం ప్రమాణ స్వీకారం చేయనున్నారు. నూతన చైర్మన్‌గా రాచగర్ల వెంకటరావు భాధ్యతలు చేపట్టనున్నారు. ఒంగోలు ఎమ్మెల్యే దామచర్ల జనార్ధనరావు అధ్యక్షతన జరిగే ఈ కార్యక్రమానికి రాష్ట్ర దేవాదాయ శాఖామంత్రి ఆనం రామ నారాయణ రెడ్డి, గృహ నిర్మాణ శాఖామంత్రి కొలుసు పార్ధసారథి, విద్యుత్ శాఖమంత్రి గొట్టిపాటి రవికుమార్, సాంఘిక సంక్షేమ శాఖమంత్రి డాక్టర్ డోలా శ్రీ బాల వీరాంజనేయ స్వామి, పార్లమెంట్ సభ్యులు మాగుంట శ్రీనివాసులు రెడ్డి, జిల్లాకు చెందిన శాసనసభ్యులు, శాసనమండలి సభ్యులు, వివిధ కార్పొరేషన్ల చైర్మన్లు, ముఖ్య అతిథులుగా హాజరు కానున్నట్లు ఏఎంసి చైర్మన్ వెంకటరావు తెలిపారు.

ప్రైవేట్ టీచర్లకు గుర్తింపు ఇవ్వాలి

ప్రజాశక్తి-ఒంగోలు సిటీ

ప్రైవేటు విద్యాసంస్థల్లో సేవలందిస్తున్న ఉపాధ్యాయులకు కూడా ప్రభుత్వ ఉపాధ్యాయుల తరహాలో గుర్తింపు, గౌరవం, భద్రతకు అర్హులే అని పలువురు వక్తలు అభిప్రాయపడ్డారు. ఆదివారం అంతర్జాతీయ ఉపాధ్యాయ దినోత్సవం సందర్భంగా ప్రైవేటు టీచర్స్, లెక్చరర్స్, ప్రొఫెసర్స్ వెల్ఫేర్ అసోసియేషన్ (పిటిఎల్ పిడబ్ల్యూఏ) ఆధ్వర్యంలో ఒంగోలు యుటిఎఫ్ భవనంలో ఉత్తమ ఉపాధ్యాయ అవార్డు ప్రదానోత్సవ కార్యక్రమం నిర్వహించారు. సంఘ జిల్లా అధ్యక్షులు వై.సాంబశివరావు అధ్యక్షతన జరిగిన కార్యక్రమంలో ప్రత్యేక అతిథులుగా జిల్లా విద్యాశాఖాధికారి ఏ.కిరణ్ కుమార్, గోదావరి జిల్లాల ఉపాధ్యాయుల శ్రేణి ఎమ్మెల్సీ బి.గోపిమూర్తి, రాష్ట్ర కన్వీనర్ ఎం.సూర్యారావు, మాంటిసోరి హైస్కూల్ కరస్పాండెంట్ పీ.శబరీనాథ్, అప్స (ఏపిపిఎస్ఏ), అప్సుస్మా (ఎపిపియుఎస్ఎంఎ) నాయకులు పాల్గొన్నారు.

మెడికల్ కళాశాలలు ప్రభుత్వ రంగంలోనే కొనసాగాలి

జెవివి రాష్ట్ర ప్రధాన కార్యదర్శి సురేష్ -మార్కాపురంలో 11న రౌండ్ టేబుల్ సమావేశం

ప్రజాశక్తి-ఒంగోలు సిటీ



కరపత్రాలు ఆవిష్కరిస్తున్న జెవివి నాయకులు

వైద్య విద్య, ప్రజారోగ్య వ్యవస్థలు ప్రభుత్వ రంగంలోనే కొనసాగాలని జన విజ్ఞాన వేదిక (జెవివి) రాష్ట్ర ప్రధాన కార్యదర్శి తవ్వా సురేష్ డిమాండ్ చేశారు. ఆదివారం ఒంగోలులోని ఎల్‌బీజీ భవన్‌లో జరిగిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ, ప్రజల ఆరోగ్య హక్కులకు హామీ ఇచ్చేది ప్రభుత్వ వైద్య వ్యవస్థ మాత్రమే అని అన్నారు. గతంలో మంజూరైన 17 ప్రభుత్వ మెడికల్ కళాశాలల్లో 10 కాలేజీలు పీపీపీ విధానంలో ప్రైవేటీకరించాలనే ప్రభుత్వ నిర్ణయం ప్రజా ప్రయోజనాలకు విరుద్ధమని ఆయన విమర్శించారు. ఈ చర్యల వల్ల పేద, మధ్యతరగతి విద్యార్థులకు వైద్య విద్య అందుబాటులో ఉండదని ఆందోళన వ్యక్తం చేశారు. జెవివి జిల్లా అధ్యక్షుడు యు.వెంకట్రావు, ప్రధాన కార్యదర్శి జి. శ్రీనివాసరెడ్డిలు మాట్లాడుతూ ప్రైవేటీకరణకు వ్యతిరేకంగా అక్టోబర్ 11న మార్కాపురం ప్రెస్ క్లబ్‌లో రౌండ్ టేబుల్ సమావేశం నిర్వహిస్తున్నామని తెలిపారు. ఈ సమావేశానికి మాజీ ఎమ్మెల్సీ కె.ఎస్. లక్ష్మణరావు, ప్రముఖ వైద్యులు, ప్రజా సంఘాల ప్రతినిధులు హాజరవుతారని తెలిపారు. ఈ కార్యక్రమంలో జెవివి సీనియర్ నాయకులు ఎ.వి. పుల్లారావు, రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు కుర్రా రామారావు, సిహెచ్ జయప్రకాష్ రావు, డాక్టర్ దార్ల బుజ్జిబాబు, జిల్లా నాయకులు యు. భాస్కర్, బి.తిరుపతయ్య, ఎన్.టి.వెంకటేష్, డిఎల్.ప్రసాద్, మాల్యాద్రి తదితరులు పాల్గొన్నారు.

ప్రజాస్వామ్యాన్ని అపహాస్యం చేస్తున్న బిజెపి

కాంగ్రెస్ ఒంగోలు కోఆర్డినేటర్ బిఆర్ గౌస్ విమర్శ

ప్రజాశక్తి - ఒంగోలు కలెక్టరేట్



సంతకాలు చేస్తున్న కాంగ్రెస్ పార్టీ నేతలు

కేంద్ర ఎన్నికల సంఘంతో కుమ్మక్కై భారతీయ జనతా పార్టీ ప్రజాస్వామ్యాన్ని, ఆ విలువలను అపహాస్యం చేస్తుందని కాంగ్రెస్ పార్టీ ఒంగోలు అసెంబ్లీ సమన్వయకర్త బిఆర్ గౌస్ విమర్శించారు. గత ఎన్నికలలో దొడ్డిదారిన బిజెపి గెలిచిన విధానాన్ని తప్పుపడుతూ లోక్‌సభ ప్రతిపక్ష నేత రాహుల్ గాంధీ చేస్తున్న పోరాటానికి మద్దతుగా, ఏఐసిసి, పిసిసి అధ్యక్షురాలు వైయస్ షర్మిల రెడ్డి ఆదేశాల మేరకు ప్రజాక్షేత్రంలో "ఓట్ల దొంగ – గద్దె దిగు" నినాదంతో ఆదివారం సంతకాల సేకరణ కార్యక్రమం చేపట్టారు. ఒంగోలు నగరం నాల్గో డివిజన్ ఇస్లాంపేట ప్రాంతంలో డిసిసి ప్రధాన కార్యదర్శి షేక్ అబ్దుల్ రవూఫ్ ఆధ్వర్యంలో ప్రారంభించారు. కార్యక్రమంలో ముఖ్యఅతిథిగా పాల్గొన్న బిఆర్ గౌస్ మాట్లాడుతూ గడిచిన లోక్ సభ ఎన్నికలతో పాటు, ఆ తర్వాత జరిగిన పలు రాష్ట్రాల శాసనసభ ఎన్నికలలో ప్రజామోదంతో పని లేకుండా ఎన్నికల సంఘాన్ని అడ్డుపెట్టుకొని బిజెపి ప్రజల ఓట్లను దొంగిలించి దొడ్డి దారిన అధికారంలోకి వచ్చిందన్నారు. ప్రజాస్వామ్యంలో ప్రజలకు ఉన్న ఓటు హక్కు అనే ఆయుధాన్ని నీరుగార్చిందని, కేంద్రంలోని బిజెపి ప్రజాక్షేత్రంలో మద్దతు కోల్పోయిందన్నారు. ఇకనైనా ప్రధానమంత్రి నరేంద్ర మోడీ ఓటు చోరీకి బాధ్యత వహిస్తూ తన పదవికి రాజీనామా చేసి తన చిత్తశుద్ధిని చాటుకోవాలని ఆయన కోరారు. ఈ సందర్భంగా ప్రజలు పెద్ద ఎత్తున సంతకాలు చేసి కాంగ్రెస్ పార్టీకి తమ మద్దతు తెలియజేశారు. కార్యక్రమంలో డిసిసి ఉపాధ్యక్షులు షేక్ రసూల్, లీగల్ సెల్ చైర్మన్ సుదర్శి రవి, కాంగ్రెస్ పార్టీ నాయకులు షేక్ కరీముల్లా, షేక్ రఫీ, యువజన కాంగ్రెస్ ఒంగోలు అసెంబ్లీ నియోజకవర్గ అధ్యక్షులు రాయపాటి గిడియన్, యువజన కాంగ్రెస్ జిల్లా ప్రధాన కార్యదర్శి షేక్ ఇమామ్, కాంగ్రెస్ పార్టీ నాయకులు బి. జోసెఫ్, షేక్ మస్తాన్ వలి, దండుప్రోలు ప్రసాద్, షేక్ కరీం బాషా పాల్గొన్నారు.

బాణసంచా గోడౌన్లలో తనిఖీ

ప్రజాశక్తి-బాపట్ల జిల్లా

దీపావళి పండుగను దృష్టిలో ఉంచుకొని బాణసంచా తయారీ కేంద్రాలు, స్టోరేజ్ గోడౌన్లు, విక్రయ కేంద్రాలలో ఎటువంటి అవాంఛనీయ ఘటనలు చోటు చేసుకోకుండా ఉండేందుకు సంబంధిత కేంద్రాల వారు తగిన జాగ్రత్తలు తీసుకోవాలని జిల్లా ఎస్పీ బి.ఉమామహేశ్వర్ కోరారు. బాణసంచా తయారీ కేంద్రాల్లో గానీ, విక్రయ కేంద్రాల్లో గానీ 18 సంవత్సరాల లోపు పిల్లలను అనుమతించరాదన్నారు. జిల్లాలోని అన్ని ఫైర్ క్రాకర్స్ గోడౌన్లు, తయారీ కేంద్రాలు, విక్రయ కేంద్రాల్లో పోలీసు బృందాలు తనిఖీలు చేశారు. బాణసంచా తయారీ, నిల్వ, విక్రయాలు జరిపే ప్రతి ఒక్కరు ప్రభుత్వ సూచించిన నియమ నిబంధనలకు అనుగుణంగా ఫైర్ సేఫ్టీ ప్రికాషన్స్ పాటించాలని ఎస్పీ సూచించారు.

బాపట్లలో 19న షాపింగ్ ఫెస్టివల్

జిల్లా కలెక్టర్ డాక్టర్ వి.వినోద్ కుమార్

ప్రజాశక్తి-బాపట్ల జిల్లా

బాపట్లలో ఈ నెల 19న షాపింగ్స్ ఫెస్టివల్ నిర్వహిస్తున్నారు. ఈ మేరకు బాపట్ల, చీరాల ప్రాంతాల్లో ఉన్న ట్రేడర్స్, అసోసియేషన్లతో జిల్లా కలెక్టర్ డాక్టర్ వి.వినోద్ కుమార్ సమీక్ష సమావేశం చేపట్టారు. ఈ కార్యక్రమానికి సంబంధించి అన్ని రకాల ట్రేడర్స్ అసోసియేషన్లు సహకరించాలని కలెక్టర్ కోరారు. అలానే ఈ నెల 11 నుంచి 18 వరకు షాపింగ్ వచ్చే ప్రజలకు సూపర్ జిఎస్టీ, సూపర్ సేవింగ్స్ గురించి ట్రేడర్స్ అసోసియేషన్లు జిఎస్టీపై అవగాహన కల్పించాలన్నారు. ఇందుకోసం జిఎస్టీపై అందరు అవగాహన కలిగి ఉండాలని అసోసియేషన్ సభ్యులకు కలెక్టర్ సూచించారు.

19న జరిగే షాపింగ్ ఫెస్టివల్‌కు కుటుంబాలలోని సభ్యులు అందరు హాజరు అవుతారని తెలిపారు. దీంతో పాటు ఈ నెల 7 న ప్రతి పాఠశాలలో, ప్రతి తరగతి గది లో 40 నిమిషాల పాటు సూపర్ జిఎస్టీ, సూపర్ సేవింగ్స్‌పై విద్యార్థులకు క్లాస్ నిర్వహించాలని డిఈఓను ఆదేశించారు. ఎదో ఒక పాఠశాలకు తాను కూడా వెళ్ళడం జరుగుతుందని జిల్లా కలెక్టర్ తెలిపారు. ట్రేడర్స్ అసోసియేషన్ సభ్యులందరితో వాట్సాప్ గ్రూపును ఏర్పాటు చేయాలని జిఎస్టీ నోడల్ అధికారి యశ్వంత్ ఆదేశించారు. జీఎస్టీ కి సంబంధించి ట్రేడర్స్ అసోసియేషన్ సభ్యులకు ఏమైనా సమస్యలు ఉంటే వాట్సాప్ ద్వారా తెలియజేయాలని అసోసియేషన్ సభ్యులకు సూచించారు.

పశు గణనపై ప్రత్యేక శ్రద్ధ

జిల్లా పశు సంవర్ధక అధికారి డాక్టర్ ఎన్.వెంకటేశ్వరరావు

ప్రజాశక్తి - ఒగోలు కలెక్టరేట్

కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల ఆదేశాల మేరకు పశు గణన కార్యక్రమంపై ప్రత్యేక దృష్టి సారించినట్లు జిల్లా పశు సంవర్ధక అధికారి డాక్టర్ ఎన్.వెంకటేశ్వరరావు తెలిపారు. పేద రైతులకు ఇన్‌పుట్ సబ్సిడీలో పశుగ్రాసం విత్తనాలు. దాణామృతం, చాప్ కట్టర్లు పంపిణీ చేశామన్నారు. జిల్లాలోని 8 నియోజకవర్గాలలో నట్టల నివారణ కార్యక్రమం చేపట్టామన్నారు. పశు కిసాన్ క్రెడిట్ కార్డుల ద్వారా 233.17 కోట్లు పశు పెంపకం దార్లకు అందజేశామన్నారు. జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకం ద్వారా జిల్లాలో మినీ గోకులాల నిర్మాణం, నీటి తొట్టెల నిర్మాణం చేపట్టామన్నారు. జిల్లా పశు సంవర్ధక శాఖ ద్వారా రైతులు, పశు పెంపకం దార్లకు అందిస్తున్న పథకాలను ఏహెచ్ఓ ప్రజాశక్తికికి వివరించారు. అవన్నీ ఆయన మాటలల్లోనే...

కలెక్టర్ పి.రాజాబాబు ఆదేశాల మేరకు జిల్లా పశు సంవర్ధక శాఖ ద్వారా పశు పెంపకందార్లకు అవసరమైన అన్ని చర్యలు తీసుకుంటున్నాం. జిల్లాలో వివిధ స్థాయిలలో పశు వైద్యశాలలు పనిచేస్తున్నాయి. ఇందులో బహుళార్ధ పశు వైద్యశాల 1, ప్రాంతీయ పశు వైద్యశాలలు 18, పశు వైద్య కేంద్రాలు 84, గ్రామీణ పశు వైద్యశాలలు 55, రైతు భరోసా కేంద్రాలు 408 ఉన్నాయి.

జిల్లాలో 35.46 లక్షల పశువులు

ప్రకాశం జిల్లాలో 35,46,289 పశువులు ఉన్నాయి. ఇందులో తెల్ల పశువులు 56,332, నల్ల పశువులు 6,71,812, గొర్రెలు 15,67,122, మేకలు 4,17,589, కోళ్ళు 8,33434 ఉన్నాయి. ప్రభుత్వ ఆదేశాల మేరకు పశు గణన కార్యక్రమాన్ని జిల్లాలో చేపట్టాం. ఇప్పటి వరకు సుమారు 75 శాతం గణన పూర్తయింది. ప్రభుత్వం నిర్దేశించిన తేదీ నాటికి 100 శాతం పశు గణన పూర్తి చేసేందుకు చర్యలు తీసుకుంటున్నా.

రైతులకు ఇన్‌పుట్ సబ్సిడీ పంపిణీ

2025–26కు గాను పేద రైతులకు 75 శాతం సబ్సిడీతో 142 మెట్రిక్ టన్నులు, 100 శాతం సబ్సిడీతో 90 మెట్రిక్ టన్నుల పశుగ్రాసం విత్తనాలు, 60 శాతం సబ్సిడీతో 176 టన్నుల దాణామృతం, 40 శాతం సబ్సిడీతో 40 చాప్ కట్టర్లు, 50 శాతం సబ్సిడీతో 250 మెట్రిక్ టన్నుల సమీకృత దాణా పంపిణీ చేశాం.

నట్టల నివారణ కార్యక్రమం

పశువులు, మేకలు, గొర్రెలు, గేదెలలో అంతర్గత పరాన్న జీవులను తొలగించటం ద్వారా బరువు పెరగటం, మరణాల రేటు తగ్గించటం కోసం నట్టల నివారణ కార్యక్రమం చేపట్టాం. మొత్తం పశువులు, గేదెలు, మేకలు, గొర్రెలకు నట్టల నివారణ టీకాలు వేశాం. జిల్లాలోని 8 నియోజకవర్గాలలోని పశువులు 56,332, గేదెలు 6,71,812, గొర్రెలు 15,67,122, మేకలు 4,17,589 మొత్తం 27,12,855 నట్టల నివారణ టీకాలు వేశాం.





రూ.233.17 కోట్లు మంజూరు

2025–26 ఆర్థిక సంవత్సరంలో పశు కిసాన్ క్రెడిట్ కార్డుల ద్వారా 27,217 పశు పెంపకందారులకు రూ.233.17 కోట్లు మంజూరు చేశాం.

1075 మినీ గోకులాల నిర్మాణం

జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకంలో 1075 మినీ గోకులాల నిర్మాణం చేపట్టనున్నాం. 90 శాతం సబ్సిడీపై పశువుల షెడ్ నిర్మాణం, 70 శాతం సబ్సిడీపై గొర్రెలు, మేకలు, కోళ్ళ షెడ్ నిర్మాణం కోసం దరఖాస్తులు తీసుకున్నారు. 1075 మినీ గోకులాల నిర్మాణం లక్ష్యం కాగా ఇప్పటి వరకు 806 మినీ గోకులాల నిర్మాణాలు పూర్తి కాగా మిగిలిన 269 నిర్మాణంలో ఉన్నాయి.

పశు బీమా పథకం అమలు

పశు బీమా కార్యక్రమంలో రైతుల పశువులు, గేదెలకు 3 వేలు (ఒక్కో జంతువుకు 3 సంవత్సరాల పాటు రూ.288లు), గొర్రెలు, మేకలు పందులకు 6 వేలు (ఒక్కో జంతువుకు 3 సంవత్సరాల పాటు రూ.56లు) 85 శాతం సబ్సిడీతో బీమా పొందవచ్చు. రానున్న కాలంలో అందరి సహకారంతో జిల్లా పశు సంవర్ధక శాఖను అభివృద్ధి చేసేందుకు కృషి చేస్తా.